మెట్రో ఈవినింగ్స్

ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

రూ.6/-

Estd : 1998, RNI No.68319/98

గోల్కొండ TV

హైదరాబాద్,మంగళవారం,
జూన్ 16, 2026
పేజీలు : 8+4
సంపుటి: 29,సంచిక:06

Published from Hyderabad http://epaper.metroevenings.com Metro Evenings Telugu Daily

మంగళవారం, తేది:16-06-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,అధిక జ్యేష్ఠ మాసం,ఉత్తరాయణం-గ్రీష్మరుతువు,బహుళ పక్షం,పాడ్యమి,ఆర్ద్ర,వర్జ్యం,ప.6.27 ల


## మోదీ రాజీనామా చేస్తే... మేమూ చేస్తాం:సీఎం

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణ ప్రాజెక్టులను ఆమోదిస్తే... బీజేపీకి భవిష్యత్తు ఉండదని... కిషన్ రెడ్డి చెప్పుడు మాటలను కేంద్రం వింటోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలు విషయం బయటపెట్టారు. రేవంత్ సర్కారుకు సహకరిస్తే... మన పార్టీకి గడ్డు పరిస్థితులుంటాయని కిషన్ రెడ్డి పదే పదే కేంద్ర మంత్రులకు నూరిపోస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ సహా... అనేక మంది కేంద్ర మంత్రులను పదేపదే కలుస్తూ... రాష్ట్ర ప్రాజెక్టులను ఒప్పించడానికి తాను ఒకవైపు కృషి చేస్తుంటే... మరోవైపు కిషన్ రెడ్డే తన ప్రయత్నాలకు ఎప్పటికప్పుడు అడ్డుపడుతున్నారని సీఎం దుయ్యబట్టారు.

# ప్రజలకు మరింత చేరువయ్యాం



### అన్ని పాఠశాల భవనాలపై సోలార్
### విద్యా, వైద్య విభాగాల్లో ఫేషియల్ అటెండెన్స్
### ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై సీఎం సమీక్ష

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 99 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిసమీక్షసమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని ముఖ్య మంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్ సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. నిని99 రోజుల యాక్షన్ ప్లాన్లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలోనే ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు. వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో.. వెంటనే వివరణ కోరాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్పై సమీక్ష నిర్వహించినట్లే.. జిల్లాల వారీగా వెంటనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్ధిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు.

## సన్నాలకు మార్కెట్లో డిమాండ్ లేదు!



### ఎగుమతి రకాల సాగుకు ప్రోత్సహించాలి
### డిప్యూటి సీఎం భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి భేటీ
### హాజరైన మంత్రులు తుమ్మల, ఉత్తమ్, శ్రీధర్ బాబు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లోనూ అద్భుతమైన డిమాండ్ ఉన్న 8 రకాల మేలురకం వరి సాగుపై రైతులకు పెద్ద ఎత్తున విస్తృతమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి సూచించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రజా భవన్లో సోమవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డి. శ్రీధర్ బాబు, ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చాలా లోతుగా సమీక్ష చేసింది. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు పాల్గొని పలు కీలక ప్రతిపాదనలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. నినికొత్త రకాలు తెలంగాణ నుంచి విదేశాలకు ఎగుమతి చేయడానికి ఇవి అత్యంత అనుకూలమైనవి. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్లు సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించారు. సన్న బియ్యానికి మార్కెట్లో ఆదరణ లభించడం లేదని సివిల్ సప్లై అధికారులు మంత్రులకు వివరించారు.



## భద్రతకు పెద్దపీట

### ఆర్టీఏ తనిఖీలు.. 150 స్కూల్ బస్సులపై కేసులు నమోదు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణలో పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో విద్యాసంస్థల బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఇవాళ వెయ్యికిపైగా స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 150కిపైగా బస్సులపై కేసు నమోదు చేశారు. ఫిట్నెస్ లేని 35 విద్యాసంస్థల వాహనాలను సీజ్ చేశారు.

## 'దేశ ఆర్థిక వ్యవస్థ గుడ్'

ఢిల్లీ (మెట్రోన్యూస్): భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు సంతృప్తికరంగానే ఉందని, అయితే ఈ వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దీర్ఘకాలికంగా వృద్ధిని కొనసాగించాలంటే నిరంతర ఆవిష్కరణలు, సంస్కరణలు, వ్యవస్థల బలోపేతం చాలా అవసరమని ఆమె స్పష్టం చేశారు. ఇవాళ జరిగిన మైండ్మైన్ సమ్మిట్ 2026లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. మన దేశం ఆర్థికంగా బాగానే రాణిస్తోందని నాకు తెలుసు. కానీ, మన పనితీరును మనం నిరంతరం జాగ్రత్తగా విశ్లేషించుకోవాలి.

## భారత అమ్ములపొదిలో మరో శక్తివంతమైన అస్త్రం

ఇంటర్నెట్ డెస్క్: భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ మరో కీలక మైలురాయిని అధిగమించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ క్షిపణి ని సోమవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ ఫ్లైట్-టెస్ట్ నిర్వహించారు.





## విపత్తుల నిర్వహణకు ముందస్తు చర్యలు

### రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్ (మెట్రో న్యూస్): వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా ముందస్తుగానే అన్ని అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉంచాలని మంత్రి సూచించారు. నినినైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తూ రాబోయే 3 నుంచి 4 రోజుల్లో తెలంగాణ అంతటా విస్తరించే అవకాశం ఉందన్నారు.

## ఫుడ్ బ్రాండ్లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా..

హైదరాబాద్ (మెట్రోన్యూస్): ఆరోగ్యకరం,సేంద్రియం వంటి ఆకర్షణీయమైన పేర్లతో వినియోగదారులను తప్పుదారి పట్టిస్తున్నాయన్న ఆరోపణలపై పలు ఆహార ఉత్పత్తుల కంపెనీలకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నోటీసులు జారీ చేసింది. ఉత్పత్తుల లేబుళ్లు, బ్రాండ్ పేర్ల విషయంలో ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006ను ల్లంఘిస్తున్నారని ఈ నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ చర్యకు సంబంధించిన వివరాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ జూన్ 14న అధికారికంగాప్రకటించింది. హెల్తీ, జీరోమైదా,ఆర్గానిక్, వేగన్ వంటి పదాలను ఎలాంటి ఆధారాలు, అనుమతులు లేకుండా పయోగిస్తున్నారనిఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తించింది.

# స్కూళ్లకు అమావాస్య ఎఫెక్ట్..

హైదరాబాద్ (మెట్రోన్యూస్): సోమవారం రోజున స్కూళ్లు ఓపెన్ అయ్యాయి. కానీ చాలా పాఠశాలల్లో ఖాళీ బెంచీలే దర్శనం ఇచ్చాయి. అమావాస్య కావడంతో మొదటి రోజు పిల్లలను స్కూల్కు పంపించేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేశారు. అయితే రేపు మంగళవారం కావడంతో.. ఆ రోజున కూడా పిల్లలు స్కూల్కు రాకపోవచ్చని స్కూల్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో బుధవారం నుంచి స్కూళ్లు మొత్తం విద్యార్థులతో కళకళలాడనున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం స్కూళ్లకు వేసవి సెలవులు పూర్తి అయ్యాయి. దీంతో సోమవారం నాడు.. రాష్ట్రంలోని అన్ని గవర్నమెంట్ స్కూళ్లు ప్రారంభమయ్యాయి. అయితే ఇవాళ అమావాస్య కావడంతో.. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్లకు పంపించలేదు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజే అమావాస్య రావడంతో.. తమ పిల్లలను పంపించేందుకు ఆసక్తి చూపించలేదు. దీంతో మొదటిరోజే స్కూళ్లలో పిల్లలు చాలా తక్కువగా కనిపించారు. దీంతో అమావాస్య ఎఫెక్ట్.. విద్యార్థులపై బాగానే పడిందంటూ స్కూల్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.



అమావాస్య భయంతో స్కూళ్లకు రాని విద్యార్థులు

## అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ

ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాంతంలో వివాదానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య అవగాహన కుదరడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందం అమలుతో పశ్చిమాసియాలో తిరిగి శాంతి, స్థిరత్వం నెలకొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపేసి, విస్తృత యుద్ధ భయాలకు కారణమైన ఈ వివాదం ముగింపు దిశగా సాగడం ఒక ముఖ్యమైన పరిణామం.అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్టు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని తెలిపారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది.

# బాల్య వివాహం బతుకు ఆగంపై రాష్ట్రవ్యాప్త పోరు

## తరుణి స్వచ్ఛంద సంస్థతో అవగాహన ఒప్పందం

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):**రాష్ట్రంలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణలను అరికట్టేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కీలక అడుగు వేసింది. ఈ దిశగా బాలికల సాధికారత, బాల్య వివాహాల నిరోధం, మానవ అక్రమ రవాణా నిరోధం వంటి అంశాల్లో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న తరుణి స్వచ్ఛంద సంస్థతో మహిళా, శిశు సంక్షేమ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఒఝా, తరుణీ ఫౌండర్స్ మమతా రఘువీర్, రఘువీర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, బాల్య వివాహం ఒక కుటుంబ సమస్య మాత్రమే కాదని, అది బాలికల భవిష్యత్తును ప్రభావితం చేసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. బాల్య వివాహాల కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోవడం, ఆరోగ్య



సమస్యలు తలెత్తడం, ఆర్థిక స్వావలంబన దెబ్బతినడం వంటి అనేక ప్రతికూల ప్రభావాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. బాల్య వివాహం –బతుకు ఆగం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా కేంద్రంగా ఈ ప్రచారం మరింత విస్తృతంగా జరగాలన్నారు.

# ఓట్ల చోరీ, సీట్ల చోరీ కాంగ్రెస్ నైజం..

**- అసలు ఓటుకు నోటుతో ఓటు చోరీ చేసింది రేవంత్ రెడ్డే..!**

**- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై రాంచందర్ రావు ధ్వజం**

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** ఓటరు జాబితా ప్రక్షాళన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు రాజకీయ స్వార్థంతో బురదజల్లుతున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, చిరునామాలు మారిన వారి వివరాల సవరణ కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తారన్నారు. దేశ సరిహద్దులైన బీహార్, పశ్చిమ బెంగాల్‌తో పాటు హైదరాబాద్ ఓల్డ్ సిటీలో కూడా రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు, పాకిస్తానీ అక్రమ చొరబాటుదారులు స్థానికంగా కొన్ని రాజకీయ పార్టీల మద్దతుతో దొంగ ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు సంపాదించి ఓటర్లుగా నమోదవుతున్నారని రాంచందర్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చరిత్రే ఓట్ల చోరీ, సీట్ల చోరీలతో కూడుకున్నదన్నారు. నాడు కాంగ్రెస్ అంతర్గత ఎన్నికల్లో సర్దార్ పటేల్‌కు 28 ఓట్లు, నెహ్రూకు కేవలం 2 ఓట్లు వస్తే



నెహ్రూను పీఎంను చేయడం ఓటు చోరీ కాదా అని ప్రశ్నించారు. బోగస్ ఓట్లతో గెలిచే అలవాటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు.. ఇప్పుడు ఎస్ఐఆర్ వల్ల తమ దొంగ ఓట్లు ఎగిరిపోతాయనే భయంతో ఏడుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని, తన సిబ్బందిపై ముఖ్యమంత్రికి నమ్మకం లేదా అని ప్రశ్నించారు. తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఏడాది జైలు శిక్ష పడుతుందనే నిబంధన ఎప్పటి నుంచో ఉందన్నారు. గతంలో ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓటు చోరీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించిన సర్పంచ్

**మెట్రో న్యూస్ కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం గ్రామపంచాయతీ సర్పంచ్ పంతకాని సడవలి పాలకవర్గం అభివృద్ధి పనులు ప్రారంభించారు. కాటారం గ్రామపంచాయతీ పదో వార్డులోని అయ్యప్ప ఓడలో సైడ్ డ్రైనేజీ నిర్మాణం పనులు స్థానిక సర్పంచ్ సడవలి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మురు గునీటి కాలువలు అస్తవ్యస్తంగా రోడ్డుమీదికి రావడంతో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా సైడ్ కాలువలు నిర్మాణం చేపట్టారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంట ఉపసర్పంచ్ కొండ గొర్ల భవన యా వార్డు మెంబర్లు కూడాపర్తి జ్యోతి రవి కొం డరాజు మల్లు దాడి మల్లయ్య మానం రాజబాబు జాడి రాజేష్ అక్క పాక మల్లయ్య ,కొండ రాము గ్రామ పెద్దలు. మొగిలి సమ్మయ్య. ప్రకాష్ పశువుల రామచంద్రు కొండ గొర్ల వెంకటస్వామి ఉదయ్ పాల్గొన్నారు.



## భట్టికి పలువురి శుభాకాంక్షలు



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆ యన్ని పలువురు నాయకులు కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ప్రజా క్షేత్రంలో సేవలందించి నిండు నూరేళ్లు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని వారు కోరారు.భట్టి విక్రమార్కకుశుభాకాం క్షలు తెలిపిన వారిలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శిఅసదుద్దీన్‌లు ఉన్నారు.



## మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర సంపద

**- కేజీబీవీ విద్యార్థుల మధ్య డిప్యూటీ సీఎం భట్టి 'బర్త్‌డే'**



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన జన్మదిన వేడుకలను అత్యంత ఆత్మీయ వాతావరణంలో, విద్యార్థుల మధ్య జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సోమవారం ఆయన సందర్శించారు. కార్పొరేట్ హంగులకు దూరంగా, ప్రభుత్వ పాఠశాల బాలికల నవ్వుల మధ్య ఆయన పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీ సీఎం విద్యార్థినులతో పాటు కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం భావిస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'అల్పాహార పథకాన్ని' అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఇంటర్ చదువుతున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పిల్లలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు నాణ్యమైన యూనిఫామ్‌లు, షూస్ అందిస్తున్నట్లు తెలిపారు.

## అమ్మకు అక్షరమాల గ్రాండ్ సక్సెస్

**- పరీక్షకు హాజరైన వారిలో 83.3 శాతం మహిళలు ఉత్తీర్ణత**



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):**నిరక్షరాస్యత నిర్మూలన, మహిళా సాధికారత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. మహిళా స్వయం సహాయక సంఘాల నిరక్షరాస్య సభ్యులకు అక్షరాస్యతను అందించాలనే సంకల్పంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విశేష ఫలితాలను అందించింది. తాజాగా నిర్వహించిన పరీక్షల్లో హాజరైన మహిళల్లో 83.3 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం కార్యక్రమం విజయానికి నిదర్శనంగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది మహిళలకు అక్షరాస్యత బోధన అందించగా, వారిలో 6 లక్షల 12 వేల మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు రాసిన వారిలో 5 లక్షల 10 వేల మందికి పైగా మహిళలు ఉత్తీర్ణత సాధించారు. ఈ విజయంతో లక్షలాది మంది మహిళలు ఇకపై పదో తరగతి పరీక్షలు రాసేందుకు అర్హత పొందారు. దీంతో వారి విద్యాభ్యాసానికి కొత్త మార్గాలు తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క స్పందిస్తూ, ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమంవిజయంమాత్రమేకాదని,రాష్ట్ర మహిళల సంకల్పం, పట్టుదల, ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

## తోలు బొమ్మ పవన్ కళ్యాణ్: మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** బీజేపీ ఆడించే తోలుబొమ్మ పవన్ కళ్యాణ్ అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం గాంధీ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ విషయంలొా పవన్ కళ్యాణ్ పదే పదే కించపరిచే మాటలు మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. రాజకీయాల్లో పవన్ కళ్యాణ్ నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు.అధికారం ఉందని తెలంగాణ గురించి ఎలా పడితే అలా మాట్లాడితే సరికాదు ఊరుకో మన్నారు.రెచ్చగొట్టే వ్యాక్యాలు సరికాదన్నారు కాంగ్రెస్ గురించి శ్రద్ధగా చరిత్రలు చదువుకుంటే మంచిదని నెహ్రూ,గాంధీ కుటుంబం త్యాగం గురించి తెలుసుకోవాలని ఆయన పవన్‌కు సూచించారు.



# పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం సహించం

## డీపీఓల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క


**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** గ్రామీణ తెలంగాణను స్వచ్ఛత, పచ్చదనానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క సూచించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నిరు. సచివాలయం నుంచి జిల్లా పంచాయతీ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఎంపీఓలు, డీఎల్పీఓల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులను సక్రమంగా నిర్వర్తించని వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాఖ కార్యదర్శి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి వారం గ్రామాలను సందర్శించి పరిస్థితులను



ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ప్రతిరోజూ సాయంత్రం ఫాగింగ్ నిర్వహించడం వంటి చర్యలను తప్పనిసరిగా చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి వారంలో ఒకరోజు డ్రై డే నిర్వహించి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. మంచినీటి పైపుల లీకేజీలను వెంటనే నివారించాలని, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లోరినేషన్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని, తాగునీటి నాణ్యత పరీక్షలను నిరంతరం చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. లక్షకు పైగా సిబ్బందితో రాష్ట్రంలో అతి పెద్ద శాఖగా పంచాయతీ రాజ్ వ్యవస్థ ఉందని, అందరూ సమిష్టిగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని మంత్రి సీతక్క అన్నారు.

## సంపద కంటే విద్య గొప్పది

**- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు**



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** షాద్‌నగర్ నియోజకవర్గంలోని లింగారెడ్డిగూడెం ప్రభుత్వ పాఠశాలను పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు సందర్శించారు. గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపీపీ చల్ల వెంకటేశ్వర రెడ్డి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే. శంకర్, ఉపాధ్యాయులు తిరుమలయ్య తదితరులతో మాట్లాడిన బక్కని నర్సింహులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సాధారణ జ్ఞానం, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. విద్యార్థులు చురుకుగా సమాధానాలు చెప్పడంతో ఉపాధ్యాయుల పనితీరును అభినందించారు. ముఖ్యంగా విద్యార్థి అద్నాన్ ప్రశ్నలకు వెంటనే సమాధానాలు ఇవ్వడంతో ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా బక్కని నర్సింహులు మాట్లాడుతూ, సంపద కంటే విద్య ఎంతో గొప్పది. భారతదేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుంది. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, చల్లా శ్రీకాంత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కే. శంకర్, ఉపాధ్యాయులు తిరుమలయ్య, కందూరి అంజయ్య, వెంకటేష్ గౌడ్, బి. నర్సింలు, జి. జంగయ్య, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై రైతు కమిషన్ సమావేశం

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** కౌలు రైతు సమస్యలపై రైతు కమిషన్ సమావేశం నిర్వహించింది. సోమవారం కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన సమావేశం సాగింది.సమావేశంలో కమిషన్ సభ్యులు రాములు నాయక్, కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, భూమి సునీల్ , కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, స్పెషల్ ఆఫీసర్ కేశవులు తోపాటు ప్రొఫెసర్ హరగోపాల్, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కన్నెగంటి రవి కొండల్ ,కిరణ్ , కౌలు రైతుల సాధన కమిటీ సభ్యులు ,డెక్కన్ డెవలప్ మెంట్ సొసైటీ సభ్యులు, కౌలు రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ, కమిషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి కౌలు రైతుల సమస్యల పరిష్కారంపై సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు.రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కిరణ్ మాట్లాడుతూ 2011 చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఉన్నా అది జరగడం లేదన్నారు. ఈ విషయమై జిల్లా స్థాయిలో కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో కొందరికి మాత్రమే కార్డులు వున్నాయని తెలిపారు.తెలంగాణ వచ్చిన తర్వాత కౌలు రైతులను పట్టించుకోలేదన్నారు. కన్నెగంటి రవి మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలను హైలెవల్ కమిటీ వేయాలన్నారు. కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు రెండు ప్రధాన సమస్యలు





ఎదురుకుంటున్నారని తెలిపారు, వాటిలో ప్రదానంగా గుర్తింపు కార్డు, పంట రుణాలు అందక పోవడమని తెలిపారు .రేవంత్ ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు గ్రామాల్లో అగ్రికల్చర్ అధికారులు ఎవరెవరూ ఏ పంట వేస్తున్నారో లెక్కలు వేస్తున్నారని ప్రభుత్వం కూడా కౌలు రైతులకు అనుకూలంగా వుందని తెలిపారు. కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కావాలన్నారు యూరియా రావడంలో ఏం చెయ్యాలి అనే దానిపై ఫోకస్ పెట్టాలన్నారు.బోనస్ కౌలు రైతులకు వస్తుందని తెలిపారు.

## ఆదివాసీ కాంగ్రెస్ బస్ యాత్ర


**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ చేసిన కృషిని ప్రజలకు చాటిచెప్పేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బస్ యాత్రను నిర్వహించనున్నట్లు టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ ప్రకటించింది. ఈ మేరకు గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో సోమవారం నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తాను పెరిగిన గ్రామంలో 85 శాతం మంది లంబాడీలు ఉండే వారని, వారి జీవన పరిస్థితులను చిన్నప్పటి నుంచే దగ్గరగా గమనించే అవకాశం తనకు లభించిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి ఐదు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా చేపట్టనున్న బస్ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో ఈ యాత్ర నిర్వహించి కాంగ్రెస్ పార్టీ గిరిజన సంక్షేమానికి చేసిన సేవలను ప్రజలకు వివరించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు.



మెట్రో ఈవినింగ్స్
3
హైదరాబాద్,
మంగళవారం,
జూన్ 16, 2026

BREAKING EDITION

# కిషన్ రెడ్డిని ఆడిస్తున్న కేటీఆర్



## డిప్యూటీ సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ప్రజాభవన్‌లో సోమవారం నాడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుకు పలువురు మంత్రులు, ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుదిళ్ల శ్రీధర్ బాబు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డిలతో పాటు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

## మెట్రో రైల్ రెండో ఫేజ్ అడ్డుకుంటుంది కిషన్ రెడ్డే జపాన్ రుణాన్ని ఆపారు... ఎన్ఓసీ కూడా ఇవ్వట్లేదు సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశను అడ్డుకుంటుంది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డే అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి తీవ్రమైన ఆరోపణలు చేశారు. నిసచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వాన్ని ఫేజ్ 2 కోసం ప్రధానితో పాటు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తిచేశాం..వారు పెట్టిన షరతులు అన్నింటినీ ఒప్పుకున్నం... ఫేజ్ 1 నిర్మించిన ఎల్అండ్‌టీ తోనే ఫేజ్ 2 నిర్మించాల్సి ఉంటుందని కేంద్రం నిబంధన పెట్టింది. ఈ ప్రతిపాదనకు ఎవెల్ అండ్ టీ అంగీకరించలేదు. జపాన్ సంస్థ ఇప్పటికే నిధులను విడుదల చేసింది..కానీ ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయడంలేదు. ఎన్ఓసీ ఇచ్చి మీ భాగస్వామ్యం వదులుకుంటారా? అలా చేస్తే మేమే మెట్రో ఫేజ్ 2 కట్టుకుంటాం. గత నష్టాలతోనే సతమతమవుతున్న తమకు ఫేజ్ 2 నిర్మించడం కష్టమని తేల్చి చెప్పింది. 30 వేల కోట్ల ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తిని 15 వేల కోట్లకే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. 13,600 కోట్లు 8.25 శాతం వడ్డీకి బ్యాంకుల్లో ఎల్ అండ్ టీ మెట్రోపై రుణం తెచ్చుకుంది ఆ లోన్ రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. 1400 కోట్లు మేం కట్టాల్సింది కట్టాం. లోన్ వచ్చినట్లే అని అనుకుంటే కిషన్ రెడ్డి అడ్డుకున్నారు. మే 20 న ఖట్టర్ ను, 21 న అశ్వినీ వైష్ణవ్ ను కలిసి ఇవ్వొద్దని చెప్పారు. అందుకే మేం కిషన్ రెడ్డి వెనక పడుతున్నాం. ఇవాళ నిధులు విడుదల కావాల్సి ఉంది.. ఆ బాధ్యత కిషన్ రెడ్డిదే.. మీకు కష్టమనుకుంటే మీ 50 శాతం భాగస్వామ్యం అవసరం లేదు. మేమే పూర్తిగా భరించి మెట్రో విస్తరణ చేసుకుంటాం. ఎందుకు కిషన్ రెడ్డి బాధ్యత తీసుకోరు? 122 కి.మీ మెట్రో రెండోదశకు కేంద్రం భాగస్వామ్యం తీసుకుంటుందా లేదా? మెట్రో ఫేజ్ 2 కు ఎన్ఓసీ ఇస్తారా లేదా? కిషన్ రెడ్డి చెప్పాలి. ఇవాళ ట్రాన్స్ఫర్ కావాల్సిన లోన్ ట్రాన్స్ఫర్ చేయించండి. కిషన్ రెడ్డి పై మాకు గౌరవం ఉంది. కానీ ఆయనపై అసహనం ఉంది. కిషన్ రెడ్డి వెనక కేటీఆర్ ఉన్నారు. కేటీఆర్ కుట్రలు కిషన్ రెడ్డి సహకరిస్తున్నారు అని సీఎం ఫైర్ అయ్యారు.




మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



## 33 ఏళ్లలో తొలిసారి.. స్లోవేకియా గడ్డపై భారత ప్రధాని

ఇంటర్నెట్ డెస్క్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఐరోపా పర్యటనలో భాగంగా ఒక చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. 33 ఏళ్లలో తొలిసారిగా ఒక భారత ప్రధాని స్లోవేకియాలో అడుగుపెట్టారు. రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఆదివారం ఆయన స్లోవేకియా రాజధాని బ్రాటిస్లావా చేరుకున్నారు. స్లోవేకియాకు 1993లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. బ్రాటిస్లావా విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్లోవేకియా విదేశాంగ మంత్రి జురాజ్ బ్లానార్ సంప్రదాయబద్ధంగా ‘బ్రెడ్ అండ్ సాల్ట్’తో ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటన భారత్–స్లోవేకియా సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మోదీ ‘ఎక్స్’ వేదికగా ఆశాభావం వ్యక్తం చేశారు.

# మోగిన బడి గంట

## తెరుచుకున్న స్కూళ్లు పాఠశాలల్లో సందడే సందడి!





హైదరాబాద్ (మెట్రో న్యూస్): నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు. పాఠశాలలకు తొలిరోజు వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వేసవి సెలవులతో బోసిపోయిన పాఠశాలలు సందడిగా మారాయి.


## ప్రభుత్వ బడుల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం




### ప్రారంభించిన పొన్నం

హైదరాబాద్ (మెట్రో న్యూస్ ): వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ మిల్క్ పథకాన్ని రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు.

## జీహెచ్‌ఎంసీ చెత్త టిప్పర్ ఢీకొని ఇద్దరు ఆటో డ్రైవర్లు మృతి



హైదరాబాద్ (మెట్రో న్యూస్) :హైదరాబాద్‌లోని మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం నెలకొంది. జీహెచ్‌ఎంసీ చెత్త ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరు ఆటో డ్రైవర్లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మంద మల్లమ్మ చౌరస్తాలోని చంద్రా గార్డెన్స్ వద్ద సంతోష్ (26) అనే ఆటో డ్రైవర్ ఆటో రిపేర్ వచ్చి ఆగిపోయింది. దీంతో తన ఆటోను మెకానిక్ షాపునకు తీసుకెళ్లేందుకు సాయం కావాలని తన స్నేహితులు ప్రసాద్, సునీల్ (33)లకు ఫోన్ చేశాడు. వారు మరో ఆటోలో అక్కడకు వచ్చారు. సంతోష్ ఆటోను తమ ఆటోకు తాడుతో కట్టి తరలించేందుకు సునీల్, ప్రసాద్ సిద్ధమయ్యారు.

## బంగారానికి మళ్లీ డిమాండ్

ఇంటర్నెట్ డెస్క్: దేశీయ మార్కెట్లో బంగారం, వెండికి మళ్లీ గిరాకీ పెరిగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు దిగిరావడం, రూపాయి విలువ బలోపేతం వంటి కారణాలతో ఈ లోహాల ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. సోమవారం హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,490 పలికింది. అటు వెండి ధర కూడా ఎగబాకింది. కేజీ వెండి ధర రూ.2.57 లక్షలకు చేరింది. గతవారం ఒకదశలో బంగారం ధర రూ.1,50,000 కన్నా దిగువకు పడిపోయిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ విపణిలోనూ బంగారం, వెండికి డిమాండ్ పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4,323 డాలర్లు, ఔన్సు వెండి ధర 70.38 డాలర్లకు చేరింది. గతవారం పసిడి ధర ఒక దశలో దాదాపు 4000 డాలర్లకు తగ్గింది. ఇక, కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1,53,258గా ఉంది.



## అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం

ఇంటర్నెట్ డెస్క్: ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి భీకరంగా సాగుతున్న అమెరికా – ఇరాన్ యుద్ధం మొత్తానికి ముగిసింది. ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం పూర్తయిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ప్రకటించారు. ఇదే విషయాన్ని ఈ డీల్‌కి మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ కూడా ముందుగానే ప్రకటించింది. అయితే, ఇరాన్ మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇరు దేశాల మధ్య ఈ ఒప్పందానికి సంబంధించి వచ్చే శుక్రవారం స్విట్జర్లాండ్‌లో సంతకాలు చేయనున్నట్లు పాక్ ప్రధాని ప్రకటించారు. ప్రపంచ దేశాలను ఇరకాటంలోకి నెట్టిన అమెరికా – ఇరాన్ యుద్ధం ఎట్టకేలకు ముగిసింది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం పూర్తయిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ప్రకటించారు. ఈ ఒప్పందంతో కీలకమైన హోర్మూజ్ జలసంధి మళ్లీ తిరిగి తెరుచుకుంటుందని, అమెరికా ఇన్నాళ్ల పాటు విధించిన దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ట్రూత్ సోషల్‌లో పీస్ డీల్‌కి సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంచారు."ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో శాంతి ఒప్పందం పూర్తయింది. ఇకపై హోర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవడానికి, అదే సమయంలో అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేయడానికి నేను పూర్తిగా అనుమతి ఇస్తున్నాను. ప్రపంచంలోని నౌకలారా.. ఇక మీ ఇంజిన్లను ప్రారంభించండి.. చమురిని ప్రవహించనివ్వండి" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ఈ ప్రకటన చేసే కొద్దిసేపటి ముందే ఈ డీల్‌కి మధ్యవర్తిగా వ్యవహరించిన పాకిస్థాన్ కూడా అధికారికంగా పోస్ట్ చేసింది. అమెరికా – ఇరాన్ శాంతి ఒప్పందం కుదిరిందని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. సుదీర్ఘ చర్చల అనంతరం అమెరికా – ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని చెప్పడానికి చాలా ఆనందంగా ఉంది. రెండు దేశాలు లెబనాన్ సహా అన్ని ప్రాంతాల్లో సైనిక చర్యలను పూర్తిగా నిలిపివేయడానికి అంగీకరించారు" అని పాక్ ప్రధాని పేర్కొన్నారు. అమెరికా – ఇరాన్ శాంతి ఒప్పందంపై రెండు దేశాలు వచ్చే శుక్రవారం స్విట్జర్లాండ్‌తో సంతకాలు చేయనున్నాయని మధ్యవర్తిత్వం వహిస్తోన్న పాకిస్థాన్ చెప్పింది.

# తెలంగాణలో డిజిటల్ పాలన..

తెలంగాణ రాష్ట్ర పరిపాలనలో పారదర్శకత, జవాబుదారితనం పెంచేందుకు వీలుగా ఇకపై రాష్ట్ర కేబినెట్ సమావేశాలను పూర్తిగా ఎలక్ట్రానిక్ విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు మంత్రుల కోసం అత్యాధునిక ట్యాబ్‌లు, నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్ సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేస్తున్నారు. దీనివల్ల కీలక సమాచారం లీక్ కాకుండా ఉండటంతో పాటు నిర్ణయాలు త్వరితగతిన రికార్డు అవుతాయి. ఈ-కేబినెట్ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇప్పటికే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలనా విభాగంలో సరికొత్త డిజిటల్ విప్లవానికి తెరలేవనుంది. రాష్ట్ర కేబినెట్ సమావేశాలను ఇకపై పూర్తి స్థాయిలో ఎలక్ట్రానిక్ విధానంలో నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. పరిపాలనా రంగాన్ని ఆధునీకరించడంతో పాటు, ప్రభుత్వ సమాచార మార్పిడిలో వేగం, పారదర్శకతను తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇందులో భాగంగానే సచివాలయం, వివిధ డైరెక్టరేట్లు, కమిషనరేట్ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల్లో విడతల వారీగా పేపర్‌లెస్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఎం అధికారులకు గతంలోనే సూచించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ సమావేశాలను సైతం డిజిటలైజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈ సరికొత్త విధానం అమల్లోకి వస్తే.. కేబినెట్ సమావేశాల్లో మంత్రుల ముందు ఎలాంటి ఫైళ్లు, కాగితపు పత్రాలు కనిపించవు. వీటికి బదులుగా మంత్రులందరికీ అత్యాధునిక ట్యాబ్‌లను అందజేయనున్నారు. ఈ ట్యాబ్‌లకు అవసరమైన ప్రత్యేక సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సదుపాయాలను సమకూర్చే పనిలో ఐటీ, సాధారణ

కృషితోనాస్తి దుర్భిక్షం

మెట్రో ఈవినింగ్స్

4, హైదరాబాద్ మంగళవారం జూన్ 16, 2026

## //ఎడిటోరియల్//

పరిపాలన శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్ రూపొందించిన అత్యంత సురక్షితమైన సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తోంది. దీని ద్వారా మంత్రులకు పంపే కేబినెట్ అజెండా నోట్స్, ప్రతిపాదనలు అన్నీ కూడా ఎలక్ట్రానిక్ విధానంలోనే పంపనున్నారు. సమావేశంలో తీసుకునే కీలక నిర్ణయాలు, ఆమోదించే తీర్మానాలు సైతం వెంట వెంటనే డిజిటల్ రూపంలో రికార్డు కానున్నాయి. ఈ-కేబినెట్ విధానం వల్ల ప్రభుత్వానికి అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. కాగితాల వాడకం తగ్గడం వల్ల పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా.. ప్రభుత్వ వ్యయం కూడా భారీగా తగ్గుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా కేబినెట్ సమావేశాల్లో చర్చకు వచ్చే అత్యంత కీలకమైన, రహస్యమైన సమాచారం బయటకు పొక్కకుండా పటిష్టమైన భద్రత లభిస్తుంది. ప్రతి నిర్ణయం ఆన్‌లైన్ వ్యవస్థలో నిక్షిప్తం కావడం వల్ల పరిపాలనలో జవాబుదారితనం మరింత పెరుగుతుంది. భారతదేశంలో ఇటువంటి పేపర్‌లెస్ కేబినెట్ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. ఆ తర్వాత ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, ఉత్తరాఖండ్, త్రిపుర, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఈ డిజిటల్ విధానాన్ని అందిపుచ్చుకున్నాయి. ఇప్పుడు అదే బాటలో తెలంగాణ కూడా చేరబోతోంది. ఈ-కేబినెట్ సమావేశాల నిర్వహణకు సంబంధించి సాధ్యాసాధ్యాలు, సాంకేతిక ఏర్పాట్లపై ఇటీవలే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఐటీ, జీఏడీ ఉన్నతాధికారులతో కలిసి ఒక ఉన్నత స్థాయి సమీ సమావేశాన్ని నిర్వహించారు. ట్యాబ్‌ల పనితీరు, సాఫ్ట్‌వేర్ భద్రత, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

## అగ్గిపుల్ల చిన్నదే !

మెట్రో డైలీ

ఓటమిని అంగీకరించడం సులభం
ఓటమిసవాలు చేయడం సాహసం
గెలుపు దాకా పోరాడడం ధీరుల లక్షణం !
ధనం, ప్రేమ, గౌరవం, గృహం, లోకం..
ఇవన్నీ ఒక రోజు మనల్ని వదిలేస్తాయి
మన కర్మలే మనకు కీర్తిని మిగుల్చుతాయి !
మనకు రావలసింది పరుగున వస్తుంది
మనది కానిది ఏం చేసినా మనకు దక్కదు
వచ్చిన దానితో ఆనంద పడడమే జీవితం !
మంచి కర్మలతో శాంతి జత కడుతుంది
సత్కర్మలు శాంతిని తోడ్కొని వస్తాయి
చెడు చేష్టలు అశాంతికి ఆజ్యం పోస్తాయి !
సంపద ఉంటే సంబంధాలు పలుచ
సంబంధాల వెంట పడితే ధనం తక్కువ
డబ్బు, సంబంధాలుంటే ఆరోగ్యం తక్కువ !
ఒక్క చెట్టు లక్షల అగ్గిపుల్లలను ఇస్తుంది
ఒక్క అగ్గిపుల్ల అడవినంతా కాల్చేస్తుంది
ఒక్క దురాలోచన మంచినంతా కాల్చేస్తుంది !
జీవిత చరమాంకంలో వెనక్కి చూస్తే..
సంపాదన, కీర్తి ప్రతిష్టలు కనిపించవు
సరిగ్గా జీవించావా లేదా అని ప్రశ్నిస్తుంది !

-మధుపాళీ, 9949700037

# సహృదయ సాహితీకారుడు ఎం.వి.నరసింహారెడ్డి



స్వయంకృషితో అంచలంచెలుగా ఎదిగి విద్యా ,సాహిత్య ,సామాజిక రంగాలను సుసంపన్నం చేసిన ఆయన ఓ రైతుబిడ్డ. పల్లె నేపథ్యం నుండి వచ్చి బహు గ్రంథకర్తగా, విద్యావేత్తగా, సాహితీవేత్తగా, సామాజిక చింతనాపరునిగా అందరి మన్ననలు పొందిన ఎం .వి. నరసింహారెడ్డి 2026 జూన్ 8వ తేదీన తమ తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య ,ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అతి చిన్న వయసులోనే ప్రేమ జీవులు- ఆదర్శ త్యాగాలు నవల 1961లో రాసి తోటి విద్యార్థుల, ఉపాధ్యాయుల అభినందనలను అందుకున్న సాహితీకారుడు నరసింహారెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని తొలి నవలాకారుడు కావడం విశేషం.నిని1940 జులై ఒకటో తేదీన కరీంనగర్ జిల్లా (ఇప్పటి జగిత్యాల జిల్లా) మల్యాల మండలంలోని తక్కళ్ళపల్లి గ్రామంలో ముదుగంటి నూర్యమ్మ, హనుమంత రెడ్డి దంపతులకు జన్మించిన ఆయన ఎం. ఏ. బి .ఈడి వరకు ఉన్నత విద్యను అభ్యసించి విద్యారంగంలో అనేక పదవులను అధిష్టించి మండల విద్యాధికారిగా ఉద్యోగ విరమణ చేశారు. తమ విశ్రాంత జీవితాన్ని అవిశ్రాంతంగా సాహితీ, సామాజిక సేవకు ఉపయోగిస్తూ అందరికీ చేరువైనారు. జగిత్యాలలో పండిత శిక్షణ కళాశాలను, బీ.ఈడీ కళాశాలను స్థాపించడంలో క్రియాశీలక పాత్రను పోషించడమేగాక... ప్రశిర్థులకు ఉపయుక్తమైన గ్రంథాలను కూడా వెలువరించారు. ఆయన రచించిన విద్యా తత్వము, విద్యా మానసిక శాస్త్రము, తెలుగు బోధనా పద్ధతులు తదితర గ్రంథాలు శిక్షణ పొందే ఉపాధ్యాయ విద్యార్థులకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చాయి. నరసింహారెడ్డి రచించిన తెలుగుతేజం, పర్యావరణం, తెలుగు వ్యాకరణ కల్పతరువు పుస్తకాలు ఆయనకు మంచి పేరును తెచ్చిపెట్టాయి.నిని మన తెలుగు కవులు గ్రంథాన్ని వెలువరించి రెండు తెలుగు రాష్ట్రాల్లో కవులను పది మందికి తెలియజెప్పారు. నరసింహారెడ్డి వృత్తిరీత్యా అధ్యాపకుడిగా పని చేశారు .ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. మంచి బోధకుడు, మాటకారి, చమత్కారి, హాస్య ప్రియుడు. అందుకే ఆయన తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో జోక్స్ బ్యాంక్, జోక్స్ టానిక్, ఆరోగ్య వర్ధన్ ,మనోరంజక్ పేర్లతో హాస్య గ్రంథాలను ప్రచురించి అందరి ప్రశంసలు అందుకున్నారు.నినిఆయన వేదాలను, రామాయణ, మహాభారతాలను తెలుగులోకి వచనానువాదం చేశారు. ఋగ్వేదము, యజుర్వేదము, అధర్వణ వేదము ,సామవేదము, వాల్మీకి రామాయణం వంటి వచనానువాదాలు చేసి ,గ్రంథాలుగా వెలువరించిన అనుభవాన్ని ఆయన సొంతం చేసుకున్నారు.నినిసాహితీ క్షేత్రంలో ఈ గ్రంథాలన్నీ ఆయనను ఓ ఆధ్యాత్మిక రచయితగా నిలబెట్టాయి.నినితాను స్వయంగా రచనలు చేస్తూ తోటి కవులు, రచయితలను ప్రోత్సహించే సద్గుణమున్న ఆయన 2000 సంవత్సరం ప్రాంతంలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం పేరున ఓ సాహితీ సంస్థను ప్రారంభించి అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు .తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014లో ఉమ్మడి తెలంగాణ 10 జిల్లాల్లోని ఉత్తమ సాహితీ కారులను ఎంపిక చేసి కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం వారితో కలిసి సంయుక్తంగా ఎం.వి నరసింహారెడ్డి సాహితీ పురస్కారాలు ప్రదానం చేసి తమ సహృదయతను చాటుకున్నారు. దాదాపు 300కు పైగా కవులు, రచయితలను తమ సంస్థ ద్వారా సత్కరించిన ఘనత ఆయనకు ఉంది.నినితెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన పిదప అప్పటి ముఖ్యమంత్రి కె .చంద్రశేఖర రావు చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాన్ని అందు కున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందారు .తెలుగు విశ్వ విద్యాలయం ద్వారా కీర్తి పురస్కారాన్ని స్వీకరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీనియర్ రచయితగా వెలుగొందుతూ డా. సినారె, డాక్టర్ బోయినపల్లి వెంకట రామారావులతో కలిసి సాహితీ కార్యక్రమాలను విస్తరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు చెందిన అప్పటి ముఖ్యమంత్రులు జనార్దన్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి వంటి ప్రముఖులతో సన్మాన, సత్కారాలను అందుకున్నారు. ఇలా సామాజిక, సాహిత్య, విద్యా రంగాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.

-దాస్యం సేనాధిపతి,
కవి,రచయిత, విమర్శకులు

## మెట్రో తెలంగాణ చావడి




## మెట్రో ఇలవేల్పు

# లక్ష్మీదేవి నివాస స్థానాలు



జీవితంలో ఆర్థికపరమైన సమస్యలు .. మిగతా సమస్యల కంటే ఎక్కువగా బాధిస్తుంటాయి. అలాంటి ఆర్థికపరమైన ఇబ్బందులు లేకుండా ఉండాలంటే అందుకు లక్ష్మీదేవి అనుగ్రహం ఉండాలి. లక్ష్మీదేవి అనుగ్రహం కలగాలంటే ఆ తల్లికి ఇష్టమైనట్టుగా నడచుకోవలసి ఉంటుంది. పాలు .. పూలు .. పసుపు .. కుంకుమ .. దీపం .. గోవు .. ధనం .. ధాన్యం .. ఇవన్నీ లక్ష్మీదేవి నివాస స్థానాలుగా చెప్పబడుతున్నాయి. అందువలన వాటి విషయంలో ఎప్పుడూ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. వాటి విషయంలో ఎప్పుడూ భక్తి శ్రద్ధలతో వ్యవహరించవలసి ఉంటుంది. అలాగే బాగా పొద్దుపోయేవరకూ నిద్రించేవారి ఇళ్లలోను .. సాయంత్రపు వేళలో నిద్రించే వారి ఇళ్లలోను లక్ష్మీదేవి ఉండదు. కష్టపడకుండా సోమరితనంతో కాలాన్ని వృథా చేసేవారి ఇళ్లను లక్ష్మీదేవి విడిచిపెట్టేస్తుంది. ఇక ఎప్పుడు చూసినా కలహాలతో వుండే ఇళ్లలోకి లక్ష్మీదేవి పొరపాటున కూడా కాలు పెట్టదట. ఎక్కడైతే పవిత్రత .. ప్రశాంతత ఉంటాయో అక్కడ లక్ష్మీదేవి అనుగ్రహం ఉంటుందనే విషయాన్ని ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి



# వరాహ రూపం...మత్స్య నైవేద్యం

వారాహీ దేవి ఆలయాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. పూర్వం ఆ దేవత పేరు కేవలం తంత్ర సాధకులకు మాత్రమే సుపరిచితంగా ఉండేది. కాగా.. కొన్నేళ్ళ నుంచి వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా వారాహీ దేవికి ప్రాచుర్యం బాగా పెరిగింది. అయితే దాదాపు పన్నెండు వందల ఏళ్ళకు పైగా ఆరాధనలు అందుకుంటున్న వారాహీ ఆలయం ఒకటి ఒడిశాలో ఉంది.


పూర్వం అంధకాసురుణ్ణి సంహరించడానికి దేవతల ద్వారా ఏడు శక్తులు ఉద్భవించాయి. ఆ శక్తులను 'సప్త మాతృకలు' అంటారు. వారిని ఉగ్ర శక్తులుగా భావిస్తారు. ఆ ఏడు శక్తులలో వారాహీ దేవి ఒకరు. యజ్ఞ వరాహమూర్తికి చెందిన శక్తిగా ఆమెను పూజిస్తారు. వరాహ ముఖం కలిగిన వారాహీని ఆహార ప్రదాతగా పరిగణిస్తారు. వివిధ ఆలయాల్లో కుడ్య చిత్రాలుగానో, ఉపాలయాల్లోనో కనిపించే సప్తమాతృకలకు ప్రత్యేకంగా ఆలయాలు చాలా తక్కువగా ఉంటాయి. ఒడిశాలోని పూరీ జిల్లా చౌరాసి గ్రామంలోని వారాహీ దేవాలయం వాటిలో ఒకటి. అంతేకాదు... నిర్మాణ శైలిలోనూ ఈ ఆలయానికి ప్రత్యేకత ఉంది. క్రీస్తుశకం పదో శతాబ్దంలో.... ఒడిశాకు ప్రత్యేకమైన 'ఖఖర శైలి'లో దీని నిర్మాణం జరిగింది. ప్రధాన ఆలయంలో ఆకర్షణీయమైన శిల్పాలు కనిపిస్తాయి. ప్రస్తుతం ఈ ఆలయం ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంరక్షణలో ఉంది. గర్భ గుడిలో అమ్మవారి విగ్రహం వరాహ ముఖంతో, పెద్ద ఉదరంతో, ఒక చేతిలో చేపను, మరో చేత్తో పాత్రను పట్టుకొని దర్శనమిస్తుంది. కాబట్టి ఆమెను 'మత్స్య వారాహీ' అని కూడా పిలుస్తారు. అమ్మవారికి చేపలను నైవేద్యంగా సమర్పించే ప్రత్యేకమైన ఆచారం ఇక్కడ ఉంది. తాంత్రిక విద్యలకు కూడా ఇది ప్రసిద్ధ క్షేత్రం అని స్థానికులు చెబుతారు.ఎలా వెళ్ళాలి?: ఒడిశాలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన కోణార్క్‌కు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. పూరీ లేదా భువనేశ్వర్ నుంచి రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు

## అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొప్పుల వెంకట్ రెడ్డి



మెట్రో న్యూస్ పెద్దపల్లి బ్యూరో. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా విధులు నిర్వహించిన కొప్పుల వెంకట్ రెడ్డికి, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీలు మరియు పదోన్నతుల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి కల్పిస్తూ పెద్దపల్లి జిల్లాకు కేటాయించింది. ఈ మేరకు సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయన, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో భేటీ అయిన కొప్పుల వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజలకు పారదర్శకమైన మరియు సమర్థవంతమైన పాలనను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన విధుల్లో భాగంగా జిల్లా అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా అందరి సమన్వయంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

## బోగస్ పెన్షన్లు యధాతథం -- పెగడపల్లి ఎంపీడీవో మౌనం




పెగడపల్లి,జూన్ 15 ( మెట్రో న్యూస్) :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బోగస్ పెన్షన్ల ఏరివేతను అధికారులు తూ తూ మంత్రంగా చేపడుతున్నారు. పెగడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో బోగస్ పెన్షన్లు ఉన్నాయని ఆధారాలతో గత నెల 27న రాతపూర్వకంగా ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా ఇప్పటివరకు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఒంటరి మహిళలగా ఉండి పెన్షన్ పొందినవారు తర్వాత కాలంలో మళ్లీ వివాహం చేసుకొని పిల్లలతో జీవనం కొనసాగిస్తూ సంవత్సరాలు గడిచినా గుర్తించక పోవడం కార్యదర్శుల పనితనానికి నిదర్శనం. బోగస్ పెన్షన్లు ఏరివేతలో భాగంగా ఫోటో ఐడెంటిటీ సరి చేస్తున్న సమయంలో కూడా యదేచ్ఛగా అప్డేట్ చేయించుకుని వెళ్తున్నారు. ఇది కార్యదర్శుల కను సన్నల్లోనే జరుగుతుందనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వా నికి ఎంతోనష్టం వాటిల్లుతుంది.గతంలో ఒంటరి మహిళగా పెన్షన్ తీసుకుని తర్వాతి కాలంలో మళ్ళీ వివాహం చేసుకుని పిల్లలంతో కుటుంబ జీవనం కొనసాగిస్తున్న వారు ప్రస్తుతం పెన్షన్ కు అర్హులా? అనర్హులా? అని ఎంపీడీఓ ను సమాచారం కోరగా అవునో, కాదో సమాధానం ఇవ్వని స్థితిలో ఉండడం బాధ్యత రాహిత్యానికి నిదర్శనం.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

### ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 71




జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 15 (మెట్రో న్యూస్) : ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం బిలి71బి ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ అధికారి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆసుపత్రిలో అందుబాటులోకి చర్మవ్యాధుల చికిత్స పరికరాలు



మెట్రో న్యూస్ పెద్దపల్లి: జిల్లా ఆసుపత్రిలో చర్మవ్యాధుల చికిత్సకు సంబంధించి అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు మరియు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఐఏఎస్ ప్రత్యేక చొరవతో ఈ పరికరాలను ఆసుపత్రికి సమకూర్చారు. ఈ నూతన పరికరాల సహాయంతో చర్మంపై ఏర్పడే పులిపిరులు (ఝితీం), స్కిన్ ట్యాగ్‌లను తొలగించడంతో పాటు ఇతర చిన్నపాటి చర్మ సంబంధిత సమస్యలకు సమర్థవంతమైన వైద్య సేవలను అందించే అవకాశం కలిగింది. ఈ విషయాన్ని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన ఈ ప్రత్యేక వైద్య సేవలను పెద్దపల్లి పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంతో మరిన్ని ఆధునిక సౌకర్యాలను కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## అమ్మమాట అంగన్వాడి బాట




కరీంనగర్, మెట్రో న్యూస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ కోతిరాంపూర్ సెక్టార్ లక్ష్మి నగర్ అంగన్వాడీ కేంద్రం లో సోమవారం అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం ర్యాలీ నిర్వహించడం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సిడిపిఓ కవిత మాట్లాడుతూ ఈ రోజు నుండి అంగన్వాడీ కేంద్రాలు పున: ప్రారంభించడం జరిగింది అని అన్నారు. ప్రైవేట్ పాఠశాల లకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలలో విద్య బోధన జరుగుతుంది అని ప్రీ స్కూల్ ఆక్టివిటీస్ వలన పిల్లల్లో మేదో శక్తి అభివృద్ధి జరుగుతుంది అని పిల్లలకు మంచి అలవాట్లు, తోటి పిల్లల తో కలిసి ఉండటం లాంటివి అలవాటు అవుతాయి అని అన్నారు. అంగన్వాడీ లో కొత్త ప్రీ స్కూల్ కరిక్యులం వచ్చింది అని ఇప్పుడు అంగన్వాడీ కేంద్రం లో మౌలిక సదుపాయాలు ఉన్నాయి అని ఆహ్లాద కర వాతావరణం లో పిల్లలకు విద్య బోధన జరుగుతుంది అని అన్నారు. 38 డివిజన్ కార్పొరేటర్ దేవసాని సరస్వతి సత్య నారాయణ, మరియు 39 డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ మాట్లాడుతూ అంగన్వాడీ లో కొత్తగా పిల్లల నమోదు కోసం తమ వంతు సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయి అని ప్రభుత్వ పథకాలు ప్రజలందరూ ఉపయోగించు కోవాలని అన్నారు. కార్యక్రమం చివరలో 5 పైబడిన పిల్లలకు విద్యారంభ సర్టిఫికెట్ పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కవిత, స్థానిక కార్పొరేటర్లు మాసం గణేష్, దేవసాని సరస్వతి - సత్యనారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్. అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరీష్, అంగన్వాడీ టీచర్ పద్మ ,ఆ్రా లు, ఏఎన్ఎం పోయేటప్పుడు ,పాఠశాల సిబ్బంది,తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

## అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

### 205 దరఖాస్తుల రాక

రాజన్న సిరిసిల్ల,మెట్రో న్యూస్ : ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొత్తం దరఖాస్తులు 205 వచ్చాయి.ఐడీఓసీ ప్రజావాణిలో డీఆర్ఓ జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



చిగురుమామిడి: (మెట్రోన్యూస్)ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ అన్నారు. సోమవారం పాఠశాల పున: ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఇర్షాద్ అధ్యక్షతన తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి సర్పంచ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయలక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అరుణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో, స్టాప్ డయేరియా, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



హనుమకొండ జిల్లా బ్యూరో చీఫ్ మెట్రో ఈవినింగ్ న్యూస్ జూన్ (15) హనుమకొండ జిల్లా లో పోలియో నిర్మూలనతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపడుతున్న పల్స్ పోలియో, స్టాప్ డయేరియా క్యాంపెయిన్, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్, ఆయా కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా వలస కార్మికులు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలు వంటి అధిక ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ట్రాన్సిట్ పాయింట్లతో పాటు అన్ని పోలియో కేంద్రాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమం విస్తృతంగా జరిగేలా స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీవోలు భాగస్వామ్యం కావాలని కోరారు.జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డయేరియా, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచాలని తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాం కుమార్ మాట్లాడుతూ, జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలోని 84,298 మంది 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 472 పోలియో బూత్‌లు, మొబైల్ బృందాలు, ట్రాన్సిట్ పాయింట్లు, అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణీ చేయడంతో పాటు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడతారని వివరించారు.జూలై 13, 20 తేదీల్లో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించి, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులందరికీ ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, డి ఆర్ ఓ శ్రీనివాస్, జెడ్పి సీఈఓ శేషాద్రి పంచాయతీరాజ్, మహిళా మరియు శిశు సంక్షేమ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

### వార్డు సభ్యులకు ఎంపీడీఓ కూచన ప్రకాశ్ సూచన



రాయపర్తి, జూన్ 15 (మెట్రో న్యూస్): గ్రామాల సమగ్ర అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని, అందుకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంఒ2018పై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కూచన ప్రకాశ్ సూచించారు. రాయపర్తి మండల కేంద్రంలో సోమవారం ప్రారంభమైన వార్డు సభ్యుల మొదటి విడత ఐదు రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాప్రతినిధులు చట్టాలు, నిబంధనలు మరియు తమ అధికారాలపై అవగాహన పెంపొందించుకున్నప్పుడే గ్రామాల్లో పారదర్శక పాలనతో పాటు సమర్థవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమ ముఖ్య శిక్షకులు బత్తుల నర్సయ్య మాట్లాడుతూ, వార్డు సభ్యులు తమ పరిధిలోని ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామసభల ద్వారా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ నిధుల సద్వినియోగం వంటి అంశాలపై ఐదు రోజుల పాటు సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఓటీలు పద్మనాభ స్వామి, విజేందర్‌లు వివిధ అంశాలపై వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు. రాయపర్తి మండలంలోని పలు గ్రామాల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆగవ్వ ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్నావు ఎలా ఉన్నది? : హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్.

**ఈ ప్రభుత్వం లో నా సొంత ఇంటి కల నెరవేరింది : ఆగవ్వ.**



తుర్కపల్లి,మెట్రో న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ని పరిశీలంచిన హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్,జిల్లా కలెక్టర్గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు చేసారు అందులో ఎన్ని ఇండ్లు పూర్తి అయ్యాయి. ఇంకా ఎన్ని ఇండ్లు నిర్మాణములో ఉన్నాయి. ఇంకా నిర్మాణాలు ప్రారంభించనివి ఎన్ని ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు.అనంతరం నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారి ఇంటికి వెళ్లి ఇండ్ల ని పరిశీలించారు. గతంలో ఏ ఇంట్లో ఉండే అని అడిగారు. అదే క్రమం లో ఆగమ్మ ఇంటిని పరిశీలించారు. ఇళ్ళు నిర్మించుకున్నావ్ కదా ఎలా అనిపిస్తుండి ఇపుడు అని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ అడగగా. చాలా సంతోషం గా ఉంది ఇన్ని సంవత్సరాల కల ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నెరవేరినేందుకు చాలా సంతోషం గా ఉంది అని తెలిపిన ఆగవ్వ.

# జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రతపై తనిఖీలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్

మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: జిల్లా వ్యాప్తంగా ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆహార భద్రతపై జిల్లా స్థాయి సలహా కమిటీ (డీఎల్ఏసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆహార భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**15 రోజులకొకసారి కార్యాచరణ ప్రణాళిక, ప్రత్యేక నిఘా**

ప్రతి పదిహేను 15 రోజులకు ఒకసారి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు. వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు అందేలా పాలు, పాల ఉత్పత్తుల విక్రయదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిత్యవసర పాలు, నూనెలు, మాంసం, గుడ్లు, స్వీట్లు, మరియు సిద్ధం చేసిన ఆహార పదార్థాలపై నిఘా పెంచి, నమూనాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.

**జాతీయ రహదారిపై దాడులు**

65వ జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లు, దాబాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఆహార నాణ్యతను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో కేసులు నమోదైన




వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు.

**పాఠశాలలు, అంగన్వాడీల్లో శిక్షణ**

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వారికి, చిన్న పిల్లలకు ఆహారం అందించే అంగన్వాడీ కార్యకర్తలకు దశలవారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు సైతం ఆహార భద్రతపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పాఠశాలల్లో ఆహార వస్తువుల నిల్వ, భద్రతకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమాజానికి హానికరమైన నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల తయారీ, నిల్వ, రవాణా మరియు అమ్మకాలపై ఆహార భద్రత, పోలీస్, మరియు ఆరోగ్య శాఖలు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

**ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తప్పనిసరి**

ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం జిల్లాలోని చిన్న, పెద్ద ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. వినియోగదారుల్లో చైతన్యం తేవడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కల్తీ ఆహారంపై ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజారోగ్య పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కల్తీ ఆహారం లేదా నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తే గూగుల్ ప్లే స్టోర్ లోని ఫుడ్ సేఫ్టీ కనెక్ట్ యాప్ ద్వారా గానీ, లేదా జిల్లా ఆహార భద్రతా కార్యాలయం 9133291926, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం 08684-222666, రాష్ట్ర ఆహార భద్రతా హెల్ప్‌లైన్ 9100105795, 040-21111111 హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎంహెచ్వో వెంకటరమణ, డిటిడిఓ శంకర్, ఎస్సి డిడి దయానందరాణి,డిఐఓ మాలతి కోటి రత్నం డిడబ్ల్యూఓ, నరసింహారావు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు

# కల్నల్ సంతోష్ బాబు జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

**ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది**



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: కల్నల్ సంతోష్ బాబు జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, దేశ సేవ కై , మాతృ భూమి రక్షణ కు ముందుకు రావాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. మహావీరచక్ర కల్నల్ సంతోష్ బాబు ఆరవ వర్ధంతి వేడుకలను సూర్యాపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ సంతోష్ బాబు చౌరస్తాలో ఆయన విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో పూర్వ సైనికుల ఆధ్వర్యంలో సంతోష్ బాబు విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది లు పాల్గొన్నారు. ఆర్మి సంప్రదాయంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాల్వాన్ లోయలో చైనా జవాన్ లతో జరిగిన యుద్ధంలో కల్నల్ సంతోష్ బాబు వీరమణం పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, డీఎస్పీ ప్రసన్నకుమార్, సిఐ వెంకటయ్య, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ , యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్,కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, కొణతం రాజేష్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాగుల వాసు, కల్నల్ సంతోష్ బాబు సతీమణి బిక్కుమల్ల సంతోషి, కల్నల్ సుంకరి శ్రీనివాసరావు రిటైర్డ్, ఎక్స్ సర్వీస్ మెన్ మేజర్ బిఎస్ఎన్ స్వామి, సుబెదార్ నీరజ్ దుబె రిటైర్డ్, హవల్దార్ సాగర్ దులాసి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రెబల్ శ్రీను, మన్నెం మల్లేష్ యాదవ్, ఆలేటి మాణిక్యం, గడ్డం వెంకన్న, నరేందర్ నాయుడు, రుక్మారావు, పాండు రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

**అల్పాహారం పంపిణీ**

కల్నల్ సంతోష్ బాబు ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి సంతోషి ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు,తోట శ్యామ్ ప్రసాద్, బిక్కుమళ్ల కృష్ణ, చల్లా లక్ష్మయ్య, మిట్టపల్లి రమేష్, సోమ ప్రవీణ్,యామా సంతోష్, బెలిదె శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు

# ఫీల్డ్ అసిస్టెంట్ ఇష్టారాజ్యం

**డబ్బు, మద్యం ఇస్తేనే ఉపాధి హామీ పనులు!**

మెట్రో న్యూస్,( జూన్ 15 ),గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, ఫీల్డ్ అసిస్టెంట్ మెరిగ శ్రీను ద్వంద్వ వైఖరితో పేద కూలీల పొట్టగొడుతున్నాడంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతని ఇంటి ముందు ధర్నాకు దిగారు. అర్హులైన ప్రతి కుటుంబానికి 120 రోజుల పనిదినాలు కల్పించాలనే ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, ఫీల్డ్ అసిస్టెంట్ తనకు నచ్చిన వారికి, లంచాలు ఇచ్చిన వారికే పనులు కల్పిస్తూ ఇష్టారాజ్యంగా



వ్యవహరిస్తున్నాడని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని నిజమైన పేదలను పక్కనపెట్టి, భూములు ఉన్నవారికే కొమ్ముకాస్తూ, డబ్బు మరియు మద్యం ముట్టజెప్పిన వారికి మాత్రమే 80 నుండి 90 రోజుల వరకు పనిదినాలు నమోదు చేస్తున్నాడని వారు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఫీల్డ్ అసిస్టెంట్‌కు అనుకూలంగా ఉండే కొందరు వ్యక్తులు ఎలాంటి పని చేయకుండానే కేవలం నిమిషంలో ఫోటో దిగి వెళ్ళిపోతున్నా మస్టర్లు పడుతున్నాయని, ఈ అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపి, బాధ్యుడైన ఫీల్డ్ అసిస్టెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, అర్హులైన పేద కూలీలందరికీ న్యాయం చేయాలని కీతవారిగూడెం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# మధిర కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

**అనాధ శరణాలయాల్లో అన్నదానం**

**గవర్నమెంట్ హాస్పిటల్ లో పాలు పండ్లు పంపిణీ**

**రక్తదానం శిబిరాలు**



మెట్రో న్యూస్ మధిర (జూన్ 15)::-మధిర పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రతి డివిజన్లో భట్టి క్రమార్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినారు దేవాలయాలు, చర్చిలు ,మసీదులు, అనాధ శరణాలయాలు హాస్పిటల్స్ ,వివిధ ప్రదేశాల్లో ఘనంగా నిర్వహించారు గవర్నమెంట్ హాస్పిటల్లో రోగులకు పాలు పండ్లు పంచి ఒక ర్యాలీగా బయలుదేరి ఆర్ వి కాంప్లెక్స్ ముందు కేక్ కటింగ్ చేసి అక్కడ నుంచి అనాధ శరణాలయంలో అల్పాహారం అందించారు ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పట్టణ అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్, తలుపుల వెంకటేశ్వర్లు, మాజీ మండల పట్టణ అధ్యక్షులు మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు మధిర పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ మరియు 21 డివిజన్ల కౌన్సిలర్లు డివిజన్ అధ్యక్షులు జిల్లా స్థాయిలో నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొని బట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి,యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి మాల వేసి కేక్ కటింగ్ చేసినారు తర్వాత శివాలయం, వినాయకుడి గుడిలో బట్టి విక్రమార్క గారి కోసం పూజలు నిర్వహించినారు 21 డివిజన్ కౌన్సిలర్ రంగా రూపా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అనాధ శరణాలయాలలో బట్టి విక్రమార్క పేరుమీద అన్న వితరణ జరిపారు అక్కడినుండి క్యాంప్ ఆఫీస్ లో కరివేద సుధాకర్ ఆధ్వర్యంలో బట్టి గారి జన్మదిన వేడుకలు 66 కేజీల కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అనేకమంది నాయకులు మాట్లాడుతూ బట్టి గారు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు వివరిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేసినారు నాయకులు కార్యకర్తలకు విందు ఏర్పాటు చేసినారు ఈ కార్యక్రమంలో వందలాది మంది జనం పాల్గొన్నారు

# ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం మెట్రో ఈవెనింగ్ జూన్ 15:ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామ కాంగ్రెస్ ఆర్గనైజర్ సాగుర్తి ఫిలిప్ గ్రామంలోని సర్వే నెంబర్ 188, 190, 119 లో ఎస్సీ ఎస్టీ వారు తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేస్తున్నారని, వీరికి వ్యవసాయ పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం



నగరం 32వ వార్డు బొక్కల గడ్డకు చెందిన టి.ఉమా రాణి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కొణిజర్ల మండలం మల్లుపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన కె.రమేష్ బాబు తనకు సర్వే నెంబర్ 24/హెచ్/6 లో 2 ఎకరాల 31 గుంటల భూమి ఉందని సీతారాం బంజర మేజర్ కాలువ నుండి మా పొలంకి పంట కాలువ ఉందని, పై భాగంలో ఉన్న రైతులు కాలువను ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని సాగునీరు రావడం లేదని, తమకు కాలువ సౌకర్యం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కొణిజెర్ల కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం మోతీనగర్ కు చెందిన కే.వెంకట కృష్ణ తమ ఇంటికి మిషన్ భగీరథ పైప్ లైన్, రోడ్డు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.సింగరేణి మండలం బొక్కలతండా గ్రామానికి చెందిన ఏ. రామారావు తన ఇంటి స్థలంలో 2 విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వీటి వల్ల ఇంటినిర్మాణానికి ఆటంకం కల్గుతున్నందున ఆ స్తంభాలు తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్ఈ టిజి ఎన్పిడిసిఎల్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో సమ్మె సైరన్..

**- 22 తర్వాత ఎప్పుడైనా సమ్మె**

**- గుర్తింపు సంఘం హెచ్చరిక**

కొత్తగూడెం, ఆర్ సి (మెట్రో న్యూస్): సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సంస్థను స్తంభింపజేసే స్థాయిలో ఆందోళనలు చేపడతామని, ఈ నెల 22 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య హెచ్చరించారు.సోమవారం పీవీకే-5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, కార్మికుల సహనాన్ని యాజమాన్యం బలహీనతగా భావించవద్దన్నారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులు, అలియాస్ పేర్ల మార్పులు, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ తొలగింపు, సొంత ఇంటి స్థలాల కేటాయింపు, డిపెండెంట్ ఉద్యోగాలు వంటి సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు నియామక ఉత్తర్వులు జారీ కావడం



ఎఐటీయూసీ పోరాట ఫలితమేనని పేర్కొన్న ఆయన, కార్మికులు ఐక్యంగా ఉంటే మరిన్ని సమస్యలకు పరిష్కారం సాధించవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కొత్త కోల్ బ్లాకుల కేటాయింపు, కొత్త గనుల ప్రారంభం, సంస్థ విస్తరణతో పాటు భవిష్యత్ తరాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. యూనియన్‌తో జరిగిన సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లు అమలు కాకపోవడానికి రాజకీయ జోక్యమే కారణమని ఆరోపించారు.కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం మొండివైఖరి కొనసాగిస్తే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉద్ధృతమవుతాయని, అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని మిరియాల రంగయ్య స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఉపాధ్యక్షులతోపాటు కత్తెర్ల రాములు, సహాయ కార్యదర్శి గట్టయ్యతో పాటు పలువురు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# SIR ప్రక్రియలో BLAలు కీలక పాత్ర పోషించాలి: ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పిలుపు



మెట్రో న్యూస్ (జడ్చర్లటౌన్ ), జూన్ 15,జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని చంద్ర గార్డెన్స్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో, జడ్చర్ల శాసనసభ్యులు శ్రీ జనంపల్లి అనిరుధ్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ SIR పై BLAలకు అవగాహన, శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 5న జడ్చర్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.
ఉదండాపూర్ ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఎమ్మెల్యే విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి ప్రాజెక్టును పూర్తి చేస్తానని హామీలు ఇచ్చినా అమలు చేయలేకపోయారని అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉదండాపూర్ భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి రూ.631 కోట్ల నిధులు మంజూరు చేసి చిత్తశుద్ధిని చాటుకున్నారని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు టీఎంసీల కేటాయింపుల సమయంలో అప్పటి పాలమూరు ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు ఉదండాపూర్ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు, ప్రాధాన్యత తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఆ సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుని ఉంటే దండాపూర్ ప్రాజెక్టు ఇప్పటికే పూర్తయ్యేదని అన్నారు.మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నాయకత్వంపై కూడా విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి అంశాలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన విఫలమయ్యారని అన్నారు. తాను మాత్రం జడ్చర్లకు బైపాస్ రహదారి, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు వంటి కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.గత ప్రభుత్వం హయాంలో జడ్చర్ల నియోజకవర్గంలో అనేక అవకతవకలు, కుంభకోణాలు జరిగాయని ఆరోపించిన ఎమ్మెల్యే, ప్రజలు వాటిని గమనించి ఇప్పటికే తగిన తీర్పు ఇచ్చారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రస్తుతం ప్రజల్లో ఆదరణ కోల్పోయి రాజకీయంగా అసహనంతో వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే నిజమైన తీర్పు ఇస్తారని అన్నారు.
జడ్చర్ల మున్సిపాలిటీలోని రంగనాయకస్వామి గుట్టపై భారీ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి సభలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈ కార్యక్రమానికి కొందరు రాజకీయ కారణాలతో అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.. ఈ నెల 17న జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాల నుంచి వచ్చిన అభివృద్ధి ప్రతిపాదనలను పరిశీలించి ప్రభుత్వానికి పంపనున్నట్లు చెప్పారు.అనంతరం BLAకు నిర్వహిస్తున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, BLAలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పూర్తి చేయండి

**జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**



నాగర్ కర్నూల్ (మెట్రో న్యూస్:జూన్ 15) జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 05, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 04, మొత్తం కలిసి 9 ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ పని చేస్తుందని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు

**సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిసారించాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జోగులాంబ గద్వాల, జూన్ 15(మెట్రో న్యూస్) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. హాజరు రిజిస్టర్ ను పరిశీలించి ఉపాధ్యాయుల వివరాలు అడి తెలుసుకున్నారు. పాఠశాలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉండడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన కమిటీని విద్యార్థులతో ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయించాలన్నారు. తరగతి గదులతో పాటు పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టుల్లో ప్రత్యేక దృష్టి సారిస్తే పదవ తరగతిలో మంచి మార్కులు పొందేందుకు అవకాశం ఉందన్నారు. గతేడాది టాపర్స్ గా నిలిచిన విద్యార్థులకంటే ఈ విద్యా సంవత్సరంలో ప్రస్తుత విద్యార్థులు బాగా చదివి ఇంకా ఎక్కువ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. సెలవులను ఎలా సద్వినియోగం చేసుకున్నారని, సమ్మర్ స్పెషల్ తరగతులకు ఎంతమంది హాజరయ్యారని అడిగారు. విద్యార్థులకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేయడం జరిగిందని, త్వరలోనే ఏకరూప దుస్తులను కూడా ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

# వనపర్తి డిపిఆర్ఓ ను సన్మానించిన జర్నలిస్టు సంఘాలు





వనపర్తి మెట్రో న్యూస్‌వనపర్తి జిల్లా ప్రజా సంబంధాల అధికారి డిపిఆర్ఓ సీతారాం నాయక్ ను వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ప్రజా సమాచారాన్ని ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో, మీడియాతో సమన్వయం కల్పించడంలో విశేష సేవలు అందిస్తున్నందుకు ఈ సన్మానం నిర్వహించినట్లు సంఘాల నాయకులు మాధవరావు, అక్కల శ్రీనివాస్ గౌడ్, జ్ఞానేశ్వర్, పెట్టుకో గుస్సా రమేష్, పుప్పం ప్రవీణ్ తెలిపారు.ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, డిపిఆర్ఓ కార్యాలయం మీడియా ప్రతినిధులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారాన్ని వేగంగా అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంబంధాల విభాగం మీడియా మరియు ప్రభుత్వ యంత్రాంగం మధ్య వారధిగా పనిచేస్తోందని కొనియాడారు.సన్మానానికి స్పందించిన డిపిఆర్ఓ సీతారాం నాయక్ జర్నలిస్టు సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఖచ్చితమైన సమాచారాన్ని చేరవేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మీడియాతో సమన్వయంతో పనిచేస్తూ ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇస్తామని, ఈ దఫా అక్రిడేషన్ కమిటీ సభ్యులు సైతం యూనియన్లకు అతీతంగా అర్హులైన జర్నలిస్టులకు ప్రతి ఒక్కరికి కార్డు అందే విధంగా సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ జర్నలిస్టు సంఘాల జిల్లా, మండల నాయకులు, విలేకరులు మరియు ప్రజా సంబంధాల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత సదుపాయా లెన్నో..

**పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మానయ్య.**

**విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ.**



మెట్రో న్యూస్ జోగిపేట్.ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో ఉచిత సదుపాయాలు కల్పిస్తుందని పిఆర్టియు జిల్లా అధ్యక్షులు ఆకుల మానయ్య అన్నారు.జోగిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఎంఈఓ కృష్ణతో కలిసి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కుల పంపిణీ చేశారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం పాఠ్యపుస్తకాలు నోట్‌బుక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, మధ్యాహ్న భోజన పథకం, వారానికి మూడు కోడిగుడ్లు, రెండు జతల యూనిఫారాలు, పరిశుభ్రమైన తాగునీరు, డిజిటల్ బోధన, క్రీడా మరియు సహపాఠ్య కార్యక్రమాలు వంటి అనేక సౌకర్యాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పిస్తున్నందున ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ఎవిద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేష్ కుమార్ ఉపాధ్యాయులు ఎ. మాణయ్య, మంజ్యా నాయక్, కె.రాములు, త్రినాధ్ రావు, జి. అనిల్ కుమార్, ఎస్. నరోత్తం కుమార్, ఎ. లక్ష్మణ్, సి.హెచ్. చంద్రశేఖర్, రజినీ కాంత్, వి.బి. శ్రీనివాస్, బి. రవికుమార్, పి.వెంకటేశం, ఎ. చంద్రశేఖర్, మజీద్ పాల్గొన్నారు. విద్యార్థులు నూతన విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించి పాఠ్యపుస్తకాలు స్వీకరించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**




మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో జూన్ 15:ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీతతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఎలాంటి జాప్యం చేయరాదని చెప్పారు. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ డివిజన్లు, కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌లో 31, సంగారెడ్డి డివిజన్‌కు 15, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్ డివిజన్‌లో 10, జహీరాబాద్ డివిజన్‌లో 6 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా 'ప్రజావాణి'

**-జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

**-ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ**

**-ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి సత్వర న్యాయం అందించాలని అధికారులకు ఆదేశాలు**



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకొని, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... స్థానిక పోలీస్ స్టేషన్‌లలో తమ సమస్యలు పరిష్కారం దొరకనప్పుడు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

మెట్రో METRO EVENINGS ఆదిలాబాద్-నిజామాబాద్
మంచిర్యాల | కామారెడ్డి
ఆసిఫాబాద్
నిర్మల్
epaper.metroevenings.com
తేది : మంగళవారం జూన్ 16 2026 పేజి నెం. : 8

# ప్రజావాణికి 135 ఫిర్యాదులు



నిజామాబాద్, జూన్ 15 ( మెట్రోన్యూస్ )ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 135 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ పి.సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయినందున అన్ని వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లా అధికారులతో పాటు మండల స్పెషల్ ఆఫీసర్లు, ఆర్.సీ.ఓలు విధిగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బాలికల పాఠశాలల్లో ఎక్కడైనా టాయిలెట్స్ అవసరం ఉన్న పక్షంలో తక్షణమే ప్రతిపాదనలు పంపాలని అన్నారు. కాగా, ఈ నెల 25 నుండి జూలై 24 వరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగనుందని, ఈ ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు అందరూ బీ.ఎల్.ఓ లను సంప్రదించి మ్యాపింగ్ ను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





## రక్తదాన ప్రోత్సాహకుడికి రాష్ట్ర గవర్నర్ అవార్డు

కలెక్టర్ అభినందనలు



నిజామాబాద్, జూన్ 15( మెట్రోన్యూస్ )ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని లోక్ భవన్లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చే ప్రదానం చేసిన వ్యక్తిగత అత్యధిక రక్తదాన ప్రోత్సాహికుడు అవార్డును రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యదర్శి ప్రశాంత్ అందుకున్నారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లోక రమణ రెడ్డి తరఫున ఈ అవార్డును ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, నిజామాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు ఇలా త్రిపాఠి అవార్డు గ్రహీత ప్రశాంత్‌ను అభినందించారు. జిల్లాలో తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతరాయంగా రక్తం అందుబాటులో ఉండేందుకు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రక్తదానం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని, సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సాయాగౌడ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, జిల్లా కోశాధికారి కరిపే రవీందర్, జిల్లా కార్యదర్శి గోక అరుణ్ బాబు, మోపాల్ మండల చైర్మన్ వెంకటేశ్వర్లు, పి.ఆర్.ఓ బొద్దుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమమే ఐజేయు ధ్యేయం

యూనియన్ సభ్యులందరికీ ఇన్సూరెన్స్ పాలసీ

టి యు డబ్ల్యు జె ఐజేయు అధ్యక్ష కార్యదర్శులు డా బూరం సంజీవ్ మహమ్మద్ అజీమ్.




మెట్ పల్లి జూన్ 15 (మెట్రో న్యూస్) : టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ యూనియన్ సభ్యులందరికీ ఇన్సూరెన్స్ పాలసీ చేయించమని టీ యు డబ్ల్యూ జే ఐజేయు మెట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డా బూరం సంజీవ్, మహమ్మద్ అజీమ్ అన్నారు.సోమవారం రోజున మెట్ పల్లి ప్రెస్ క్లబ్ జర్నలిస్టులందరికీ ఇన్సూరెన్స్ పాలసీ చేయించిన సందర్భంగా అధ్యక కార్యదర్శులు డా బూరం సంజీవ్, మహమ్మద్ అజీమ్ లు మాట్లాడుతూ...
జర్నలిస్టుల వృత్తిపరమైన ఒత్తిడి కారణంగా అనారోగ్యానికి గురవడమే కాకుండా కొంతమంది జర్నలిస్టులు మృతి చెందిన సంఘటనలు కూడా ఇటీవల చోటు చేసుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు, వారి కుటుంబాల కోసం ఆరోగ్య భీమా, జీవిత బీమా సౌకర్యం కల్పించే అంశాన్ని ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి ఆ దిశగా ఐజేయు సభ్యులందరికీ ఇన్సూరెన్స్ పాలసీ చేయించమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్, క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్,రఫీ ఉల్లా, సోహెల్, హైమద్, ముత్యాల రమేష్, బొల్లం రాజు, మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, ఏసమేని గణేష్, శశి కుమారు, అమ్ముల



## ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

కామారెడ్డి జూన్ 15 (మెట్రో న్యూస్)జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 93 దరఖాస్తులు వచ్చాయని భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఉపాధి, గృహాలు, రెవెన్యూ , ఇతర శాఖలకు సంబంధించిన వినతులు ప్రజలు సమర్పించారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, ఎన్ వి గిరి, జెడ్పి సీఈవో చందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దండి సుదర్శన స్వామీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నదాన కార్యక్రమం





బాన్సువాడ జూన్ 15 మెట్రో న్యూస్ బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ శివారు ప్రాంతంలో గల దండి సుదర్శన ఆశ్రమం లో అధిక మాసం ఆఖరి రోజు అమావాస్య ను పురస్కరించుకొని దండి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ దండి సుదర్శన స్వామీజీ వారి ఆధ్వర్యంలో సోమవారం నాడు దండి ఆశ్రమం లో నెలకొన్న శ్రీ కాశి విశ్వేశ్వర స్వామి మరియు కాలభైరవ, శ్రీ వారాహి మాత మరియు శ్రీ గురు దత్తాత్రేయ స్వామి వార్లకు ఉదయం నుంచే భక్తులచే ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, పూజలు జరిపించారు. అనంతరం మధ్యానం ఆశ్రమానికి వచ్చిన భక్తుల కు దండి స్వామి వారు ప్రత్యేక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది కి మరియు రోగులకు ప్రత్యేక భోజనం పొట్లాలను పంపించారు. ఆశ్రమం లో జరిగిన కార్యక్రమంలో మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

-ఆర్ఎన్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్, జూన్ 15( మెట్రోన్యూస్ ) చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్ఎన్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఎయిమ్స్ ఆస్పత్రిలో వైద్య శిక్షణ పొందిన పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అబ్దుల్ సమద్ జిల్లా కేంద్రంలో ఆస్పత్రిని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఆస్పత్రిలో చిన్నారులకు సంబంధించి అన్ని రకాల వైద్య పరికారాలను అందుబాటులో ఉంచుతూ నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్దుల్ సమద్ మాట్లాడుతూ తమ ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా వారం రోజులపాటు చిన్నారులకు ఉచిత కన్సల్టేషన్ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, మేయర్ కూరగాయల ఉమారాణి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాంభూపాల్, ఆస్పత్రి మేనేజర్ మహమ్మద్ బిలాల్ తదితరులు పాల్గొన్నారు



## కన్న కొడుకు నుండి మమ్మల్ని కాపాడండి .

-ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన వృద్ధ దంపతులు.




నిజామాబాద్ జూన్ 15 (మెట్రోన్యూస్ )కన్న కొడుకు నుండి తమను కాపాడాలని వేల్పూర్ కు చెందిన వృద్ధ దంపతులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కు ఆవేదనతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వేల్పూర్ పోలీసులకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించిన వివరాలు వృద్ధ దంపతులు మీడియాకు వెల్లడించారు. వేల్పూర్ మండలం పడిగెల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడి గా పనిచేస్తున్న కొండ్లెపు శంకర్ మా కుమారుడని, అతని నుండి మాకు ప్రాణహాని ఉందని,వృద్ధ దంపతులమైన మమ్మల్ని మానసిక వేధనకు గురిచేస్తూ చంపడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. 80 సంవత్సరాల కొండ్లెపు చిన్న బాలయ్యా, అతని భార్య 75 సంవత్సరాల కొండ్లెపు రాధ లు వృద్ధాప్యంలోనూ వేల్పూర్ లో కూలీ పని చేస్తూ జీవిస్తున్నామని,మా రెండవ కుమారుడు కొండ్లెపు శంకర్ గత కొద్దిరోజుల నుండి వృద్ధులమైన మమ్మల్ని మానసికంగా వేధిస్తున్నారన్నారు.మేము 4-65 లో గల ఇంటిలో నివాసం ఉంటున్నాము.మాకు మాయ మాటలు చెప్పి మాకు తెలియకుండా నా ఇల్లును శంకర్ అతని వదిన కొండ్లెపు విజయ అను మహిళపై రిజిస్ట్రేషన్ చేయించాడని, మా జీవనాధారం కోసం మేము దాచుకున్న ఆరు లక్షల యాభై వేల రూపాయలను శంకర్ వద్ద ఉంచడం జరిగిందన్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్న మేము మా యొక్క అవసరం నిమిత్తం శంకర్ వద్ద దాచుకున్న డబ్బులను ఇవ్వమని అడుగగా నన్ను, నా భార్యను వృద్ధులమని చూడకుండా ఇంట్లో బంధించి తీవ్ర చిత్ర హింసలకు గురి చేశాడని కలెక్టర్ కు ఇచ్చిన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. . మరోసారి డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించి మానసికంగా వేధిస్తున్నాడన్నారు. ఈ విషయాన్ని గత నెల 16వ తేదీన పోలీస్ కమీషనర్ కు మా కుల పెద్దలు, రాష్ట్ర అధ్యక్షుల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశామన్నారు.. అప్పటి నుండి నా పై ఫిర్యాదు చేస్తావా అంటు మానసికంగా వేధిస్తు మమ్మల్ని చిత్రహింసలకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. కూలీ పని చేసి వాడిని చదివించి ప్రభుత్వ ఉద్యోగిగా తీర్చిదిద్దినందుకు మమ్మల్ని చంపడానికి సిద్ధమయ్యాడని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. మా కొడుకు నుండి రక్షణ కల్పిస్తు చట్టపరమైన చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయగలరని కలెక్టర్ కు వినతి పత్రం అందించారు.

# అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ దందా బట్టబయలు

**మెట్రో న్యూస్, సరూర్ నగర్:** గృహ వినియోగ ఎల్ పి జి సిలిండర్ల నుంచి ఆటోలకు గ్యాస్ నింపుతున్న వ్యక్తి అరెస్ట్ 15 సిలిండర్లు, రెండు రీఫిల్లింగ్ యంత్రాలు స్వాధీనంమెట్రో న్యూస్, సారూర్‌నగర్ జూన్ 15సారూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గృహ వినియోగ ఎల్ పి జి గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తూ ఆటోరిక్షాలకు గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఈ అక్రమ దందాను గుర్తించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం సమీపంలోని ఓ గుడిసె వద్ద గృహ వినియోగ సబ్సిడీ ఎల్ పి జి సిలిండర్ల నుంచి ఆటోలకు గ్యాస్ నింపుతున్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సభావత్ రవి (38) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, గృహ వినియోగ సిలిండర్లను సేకరించి వాటిలోని గ్యాస్‌ను ఎల్ పి జి ఆటోలకు నింపి విక్రయిస్తున్నట్లు వెల్లడైనట్లు తెలిపారు.దాడి సమయంలో నిందితుడి వద్ద నుంచి 13 ఖాళీ హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు, ఒక ఇండేన్ గ్యాస్ సిలిండర్, ఒక భారత్ గ్యాస్ సిలిండర్‌తో పాటు రెండు గ్యాస్ రీఫిల్లింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 15 సిలిండర్లు రెండు రీఫిల్లింగ్ పరికరాలను పోలీసులు సీజ్ చేశారు.ఈ ఘటనపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు



కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గృహ వినియోగ ఎల్ పి జి సిలిండర్లను వాణిజ్య అవసరాలకు లేదా అనుమతి లేకుండా ఇతర వాహనాలకు గ్యాస్ నింపేందుకు వినియోగించడం చట్టవిరుద్ధమని, ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని



అధికారులు హెచ్చరించారు.ప్రమాదాలకు దారితీసే అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాల గురించి ప్రజలు సమాచారం అందించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో అమావాస్య అల్పాహార ప్రసాద వితరణ



**కాప్రా, జూన్ 15 (మెట్రో న్యూస్):** కుషాయిగూడలోని శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ప్రతి అమావాస్య రోజు నిర్వహించే అల్పాహార ప్రసాద వితరణ కార్యక్రమం సోమవారం హనుమాన్ విగ్రహ సమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అల్పాహార ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, కార్యసిద్ధి హనుమాన్ దేవాలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయ గర్భగుడిలో నవ హనుమాన్ మూర్తులతో పాటు శ్రీరామాయణంలోని ముఖ్య ఘట్టాలను ప్రతిబింబించే సన్నివేశాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి, ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించి, విరాళాల ద్వారా చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చల్లా ప్రభాకర్, యావపురం రవి, పనగట్ల చక్రపాణి గౌడ్, పిట్టల రాజు, పాండాల గణేష్ గౌడ్, చల్ల వెంకటేష్, అనిల్ యాదవ్, చల్ల లక్ష్మణ్, నాలచెరువుల జనార్ధన్, హరి నాయక్, బాబు గౌడ్, బాలకృష్ణ, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యువ ఈతగాడు చదల్ల వెంకటమణిధర్ రావుకు శుభాకాంక్షలు తెలిపిన గాంధీ



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** జాతీయ స్థాయి ఫిన్‌స్విమ్మింగ్ పోటీలలో రజత పతకం సాధించి సీఎంఏఎస్ వరల్డ్ ఫిన్స్‌విమ్మింగ్ ఇండోర్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిన వివేకానందనగర్ కాలనీకి చెందిన శ్రీధర్ రావు కుమారుడు యువ ఈతగాడు చదల్ల వెంకటమణిధర్ రావును సోమవారం పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఛాంపియన్ షిప్‌కు దేశం మొత్తం నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారుడిగా మణిధర్ రావు నిలవడం స్ఫూర్తి దాయకమన్నారు. ఈ విజయంతో తెలంగాణ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో మరింత ఎత్తుకు తీసుకెళ్లిన మణిధర్ రావుకు అభినందనలు తెలియజేస్తూ ప్రపంచ వేదికపై దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గాంధీ ఆకాంక్షించారు.


## పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కృషి : అరెకపూడి గాంధీ



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** వివేకానందనగర్ మెయిన్ రోడ్డులో అసంపూర్తిగా మిగిలిపోయిన సర్వీస్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. సోమవారం ఆయా ప్రాంతాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మిగిలిపోయిన సీసీ రోడ్డు పనులు త్వరలోనే మొదలు పెట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు మధ్యలో ఉన్న మూడు కరెంటు స్తంభాలు తొలగించి సీసీ రోడ్డు తొందరగా కంప్లీట్ చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు జనంపల్లి పురేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు గుర్రం గాయత్రీప్రసాద్, జి.నర్సింగ్ రావు, శ్రీధర్, కృష్ణంరాజు, నాయకులు సంజీవరెడ్డి, ఎండి ఇబ్రహీం, మల్లయ్య, శివ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతకు ప్రాధాన్యం నివారణ చర్యలు, ట్రాఫిక్ ఏర్పాట్లపై అధికారుల సమీక్ష


**మెట్రో న్యూస్, ఎల్ బి నగర్:** భారీ వర్షాల నేపథ్యంలో నీరు నిలిచే ప్రాంతాల పరిశీలననగరంలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఎల్ బి నగర్ పరిధిలో నీరు నిలిచే అవకాశం ఉన్న ప్రాంతాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ముందస్తు చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్ బి నగర్ డీసీపీ అనురాధ ఐపీఎస్, స్థానిక పోలీసు అధికారులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది మరియు జీ హెచ్ ఎంసీ అధికారులతో కలిసి ఎల్ బి నగర్, వనస్థలిపురం పరిధిలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించారు. వర్షాల సమయంలో నీరు నిలిచే ప్రాంతాలు, రహదారుల పరిస్థితి, డ్రైనేజీ వ్యవస్థ పనితీరును పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నీరు నిల్వ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరించేలా సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, అవసరమైన భద్రతా చర్యలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.వర్షాకాలంలో ప్రమాదాలను నివారించేందుకు సమస్యాత్మక ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అధికారులు ప్రజలకు సూచిస్తూ, భారీ వర్షాల సమయంలో నీరు నిలిచిన రహదారులపై ప్రయాణాన్ని వీలైనంత వరకు నివారించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని కోరారు. అలాగే వర్షాల కారణంగా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల భద్రత, సౌకర్యాల పరిరక్షణ కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు.



## ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిశీలించండి

### - అదనపు కలెక్టర్ విజయేదర్ రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (మెట్రో న్యూస్ ):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టరు (95) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వసా రని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కాస్ బాగ్ రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం

### - ప్రభుత్వం తమ హక్కుదారులుగా ప్రకటించి తగిన పత్రాలు అందజేయాలి
### - నాదర్ గుల్ నుండి 14 కి.మీ మేర కలెక్టరెట్ వరకు రైతుల పాదయాత్ర

**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** సోమవారం కాస్ బాగ్ రైతుల సంఘం అధ్యక్షులు చిర్ర రాజు ఆధ్వర్యంలో రైతులు ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నాదర్గుల్ నుండి మొదలు పెట్టి పాదయాత్రగా వందలాది మంది రైతులు14 కిలో మీటర్లు పాదయాత్ర చేసి కలెక్టరేట్ చేరి, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో వినతి పత్రం సమర్పించారు.ఈ పాదయాత్ర రైతుల గోసయాత్రగత 82 రోజులుగా నాదర్గుల్ సర్వేనెం. 613 – 119 ఎకరాల భూమికి సంబంధించి కాస్ బాగ్ రైతులు నిరసనలు,వంటావార్పు కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. రైతుల గోసను ప్రభుత్వానికి వినిపించడానికి చలో కలెక్టరేట్ పాదయాత్రకు పిలుపునిచ్చానారు. దాదాపు 70 ఏండ్లుగా ఈ భూమిని చదును చేసుకుంటూ పంట పండించుకుంటూ జీవిస్తు, ప్రభుత్వానికి తగిన రీతిలో శిస్తూ కూడా కడుతున్నామని అన్ని రకాల హక్కు దారులము, రైతులమైన మేమే నని




మాత్రమేనని అన్నారు. దశాబ్దాలుగా లేనివ్యక్తులుఎప్పుడో రాజుల కాలం నాటి పత్రాలు పట్టుకొని మేమే హక్కుదారులము అనడం అమానుషం. ఎన్నో ఎందుకువ్యవసాయంచేస్తూజీవిస్తున్నతమనిప్రభుత్వం హక్కుదారులుగా ప్రకటిస్తూ అట్టి భూములకు సంబంధించిన తగిన పత్రాలు తమకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సరైన రీతిలో న్యాయం జరగకపోతే రాబోయే రోజుల్లో ఇంకా ఎన్నో ఉద్యమాలు, ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని రైతులు హెచ్చరించారు. రైతులకు న్యాయం చేసే వరకు పోరాడుతామని సంఘం నాయకులు అన్నారు.

## ఘనంగా సాయిబాబు చౌదరి జన్మదిన వేడుకలు



**మెట్రో న్యూస్, కేపీహెచ్‌బీ కాలనీ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి 51వ జన్మదిన వేడుకలు అభిమానులు, ప్రజల సమక్షంలో సోమవారం కేపీహెచ్‌బీ కాలనీలో ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు ఆయన చేత కేక్ కట్ చేయించి పుష్పగుచ్ఛాలు అందజేసి గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ, సాయిబాబు చౌదరి గత 25 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ అంకితభావంతో పని చేస్తున్నారని కితాబిచ్చారు. కరోనా కాలంలో నిత్యావసర సరకుల పంపిణీ, వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు, పేదలకు వైద్య సహాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి సాయిబాబు చౌదరికి బొకే అందజేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, సాయిబాబు చౌదరి ప్రజల కోసం నిరంతరం సేవ చేస్తున్న నాయకుడని, రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ఇంకా ఎక్కువ సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలని కోరుకుంటున్నానని చెప్పారు.

## యూనియన్ నియమ నిబంధనలు లోబడి తాపీ మేస్త్రిలు పని చేయాలి

### - భవన నిర్మాణ కార్మికుల భారీ బైక్ ర్యాలీ భారీ బహిరంగ సభ

**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికులు సోమవారం 500 మందితో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ కేంద్రంలోని వైష్ణవి గార్డెన్స్‌లో బహిరంగ సభ నిర్వహించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎంపల్ల గోవర్ధన్ రెడ్డి మాట్లా డుతూ రాష్ట్ర నాయకులు ఐలయ్య సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులంతా ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.మూడు మండలాల్లో సెంట్రింగ్ మేస్త్రీలు, కూలీలు రేట్లు పెంచడంతో తాపీ మేస్త్రీలు, గుత్తేదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణ పనులకు స్క్వేర్ ఫీట్‌కు రూ.320 నుంచి రూ.400 వరకు ధరలను నిర్ణయించినట్లు వెల్లడించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు పూర్తి బాధ్యత యూనియన్‌దేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ రంగానికి సంబంధించిన మేనిఫెస్టోను విడుదల చేశారు. రెండు రోజుల్లో పనులు ప్రారం భిస్తామని పేర్కొన్నారు. మేనిఫెస్టో నిబంధనలను ఉల్లంఘించి తక్కువ ధరలకు పనులు చేపడితే రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు జరి మానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే నియోజకవర్గంలోని కార్మికులకు యూనియన్ తరపున గుర్తింపు కార్డులు అందజేస్తామని, గుర్తింపు కార్డు లేని వారు పనులు చేయరాదని తెలిపారు. ఇతర మండలాల నుంచి వచ్చి పనిచేస్తే రూ.20 వేల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. భవన నిర్మాణ రంగంలో కార్మికుల హక్కుల పరిరక్షణ, పనుల్లో క్రమ బద్ధత తీసుకురావడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని యూనియన్ నాయకులు తెలిపారు.



ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రిల మంచాల మండల ముర్రి ఐలయ్య, ఇబ్రహీం పట్నంమండల కాలే మల్లేష్,యాచారం మండలం సిద్ధం రవి తో పాటు తాపీ మేస్త్రీలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన రామరాజు

**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** కేంద్ర మంత్రి జీ.కిషన్ రెడ్డిని మేడ్చల్ జిల్లా భారతీయ జనతా పార్టీ మాజీ ఉపాధ్యక్షులు అల్లూరి రామరాజు మర్యాదపూర్వకంగా కలిసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అల్లూరి రామరాజు మాట్లాడుతూ, కిషన్ రెడ్డి ఎన్నో ఏళ్లుగా వివిధ రూపాల్లో ప్రజలకు సేవ చేస్తూనే భారతీయ జనతా పార్టీ పటిష్టతకు విశేషంగా కృషి చేస్తున్నారని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ డివిజన్ కు చెందిన పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆంధ్ర వార్తలు మెట్రో
మంగళవారం, 16 జూన్ 2026


## జన్మదిన శుభాకాంక్షలు



తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన సోషల్ మీడియా వేదికగా భట్టి విక్రమార్కను అభినందిస్తూ ఒక సందేశాన్ని పంచుకున్నారు.
వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా స్పందిస్తూ.. "తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గారికి జన్మదిన శుభాకాంక్షలు. వారు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు, నిరంతర సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుడిని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.



# భారత్ అతిపెద్ద ఆర్థిక శక్తి


అమరావతి/సింగపూర్, జూన్ 15: సింగపూర్ పర్యటనలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిజీబిజీగా గడుపుతున్నారు. కాపిటలిస్టుల రౌండ్‌టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భారత్ సంస్కరణలతో దూసుకుపోతున్న అతిపెద్ద ఆర్థికశక్తి అని అన్నారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టిందని.. కానీ భారత్‌కు అంత సమయం పట్టడం లేదని చెప్పుకొచ్చారు.
ప్రధాని మోదీ దేశాన్ని అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక పరికరాల తయారీలో భారత్‌ది అగ్రస్థానమన్నారు.
ఎలక్ట్రానిక్స్ పరికరాలు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని సీఎం వెల్లడించారు. 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ సహా ఇతర ఉత్పత్తులు వస్తున్నాయన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెంట్‌తో అతిపెద్ద యువశక్తి కలిగిన మానవ వనరులను భారత్ కలిగి ఉందన్నారు. ఏపీలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా వన్ ఫ్యామిలీ వన్ ఆంత్రప్రెన్యూర్ విధానాన్ని అనుసరిస్తున్నామన్నారు. భూ సమీకరణ అనే కొత్త విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నామని.. అమరావతి రాజధాని ఈ ప్రాతిపదికనే నిర్మిస్తున్నామని చెప్పారు. ఆమ్కా, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ పరిశ్రమలకు భూములను కేటాయించామని తెలిపారు.
శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని సీఎం అన్నారు. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందని తెలిపారు. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందన్నారు. అత్యుత్తమ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ సమావేశానికి సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, ఏపీ మంత్రి నారాయణ, సింగపూర్ స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులు హాజరయ్యారు.




## విభజన తీరుపై ఆవేదనే తప్ప.. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించలేదు!

న్యూఢిల్లీ, జూన్ 15: జనసేన ప్రస్థానం- జాతీయ సమగ్రత కోసం ప్రత్యేక సమావేశం ఢిల్లీ వేదికగా ప్రారంభమైంది. వందేమాతర గీతాలాపన అనంతరం జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభోపన్యాసం చేశారు. జాతీయ సమైక్యతపై జనసేనాని దిశానిర్దేశం చేశారు. జనసేన పార్టీని ప్రారంభించి 12 ఏళ్లు పూర్తైందని తెలిపారు. ఈ 12 ఏళ్లలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశామని గుర్తుచేసుకున్నారు. అధికారంలోకి రావాలన్న ఆశతో పార్టీ పెట్టలేదని.. దేశ సమగ్రతను కాపాడటమే జనసేన లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీ బాగుపడాలంటే.. దేశ సమగ్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తమ మనుగడ కోసం కొన్ని పార్టీలు దేశ సమగ్రతను ప్రమాదంలో పడేస్తున్నాయని తెలిపారు. దేశ స్ఫూర్తిని ప్రతితరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
తెలంగాణ ఏర్పాటును తాను వ్యతిరేకించలేదని పవన్ వెల్లడించారు. ఏపీని కాంగ్రెస్ విభజించిన తీరుపైనే ఆవేదన వెలిబుచ్చామని వివరించారు. తెలంగాణ విభజనకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదన్నారు. కాంగ్రెస్ విభజించిన తీరు.. అసంతృప్తి, అశాంతిని సృష్టించిందని వ్యాఖ్యానించారు. ఇప్పటికీ ఆస్తుల పంపిణీ, తదితర సమస్యలు అలానే ఉన్నాయన్నారు. ఢిల్లీ మెడలు వంచుతామని చాలా మంది మాట్లాడుతున్నారని.. కానీ ఢిల్లీకి రాగానే ఎవరి నోర్లు పెగలవని దుయ్యబట్టారు. దేశ రక్షణకు, భద్రతకు ప్రధాన కేంద్రం ఢిల్లీ అని తెలిపారు. స్వాతంత్ర్య యోధుల త్యాగాలకు ఈ గడ్డ నిలయమన్నారు. రాజ్యాంగం పుట్టిన చోటు కాబట్టే ఇక్కడ సమావేశం ఏర్పాటు చేసినట్లు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి జనసేన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెలుగు రాష్ట్రాల కీలక నాయకులు హాజరయ్యారు.






## ధీరజ్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి: ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-3 టోర్నీలో రెండు స్వర్ణ పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన తెలుగు ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. టర్కీలోని ఆంటాల్యాలో జరిగిన పోటీల్లో ధీరజ్ అద్భుత ప్రతిభ కనబరిచి మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌తో పాటు పురుషుల వ్యక్తిగత రికర్వ్ విభాగంలోనూ స్వర్ణ పతకాలు గెలుచుకోవడం విశేషమని పేర్కొన్నారు.
సోషల్ మీడియా వేదికగా స్పందించిన సీఎం చంద్రబాబు.. ధీరజ్ సాధించిన విజయాలు యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆర్చరీలో అగ్రస్థానంలో ఉన్న దక్షిణ కొరియాకు చెందిన లీ వూ సియోక్‌ను ఫైనల్లో ఓడించి స్వర్ణ పతకం సాధించడం ధీరజ్ ప్రతిభకు నిదర్శనమన్నారు.
మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్‌తో కలిసి స్వర్ణం సాధించిన కుమ్కుమ్ మోహొద్‌కు, అలాగే టీమ్ ఇండియాకు సీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశ ఖ్యాతిని మరింత పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు.



## మహాశివుడికి లోకేశ్ దంపతుల రుద్రాభిషేకం

అమరావతి, జూన్ 15: ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి దంపతులు ఈరోజు(సోమవారం) హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశిష్టమైన సోమవారం సందర్భంగా మహాశివుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో లోకేశ్ దంపతులు నిర్వహించారు. ఆయురారోగ్యాలు, రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుత్వికుల వేదమంత్రాల నడుమ లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.
రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కాంక్షిస్తూ లోకేశ్, బ్రాహ్మణి శివారాధన చేశారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేదోక్తంగా నిర్వహించారు. శివానుగ్రహం కోసం లోకేశ్ కుటుంబం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర సుభిక్షం కోసం మహాశివుడిని లోకేశ్ దంపతులు ప్రార్థించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం ప్రత్యేక హారతులు, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు.

## శ్రీవారి 'సాలకట్ల జ్యేష్టాభిషేకం




కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రంలో జూన్ నెలలో మరో అత్యంత పవిత్రమైన సుదీర్ఘ సాంప్రదాయ ఉత్సవానికి సమయం అసన్నమైంది. శ్రీవారి ఆలయంలో జూన్ 26వ తేదీ నుంచి జూన్ 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు 'సాలకట్ల జ్యేష్టాభిషేకం' వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ప్రకటించింది. ప్రతి సంవత్సరం జ్యేష్టమాసంలో జ్యేష్టా నక్షత్రానికి ముగిసేలా ఈ ప్రత్యేక అభిషేక మహోత్సవాన్ని నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ.
శ్రీవారి ఆలయ పరిధిలోని సంపంగి ప్రదక్షిణంలో ఉన్న కల్యాణ మండపంలో ఈ పవిత్ర క్రతువును శాస్త్రక్తంగా నిర్వహిస్తారు. ఆధ్యాత్మిక పరిభాషలో ఈ ఉత్సవానికి "అభిద్యేయక అభిషేకం" అనే మరొక విశిష్టమైన పేరు కూడా ఉంది.
తరతరాలుగా నిత్యం జరిగే వివిధ రకాల అభిషేకాలు, పూజాది క్రతువుల వల్ల అత్యంత ప్రాచీనమైన, పవిత్రమైన శ్రీవారి ఉత్సవమూర్తులు (శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి) అరిగిపోకుండా, ఎలాంటి డ్యామేజ్ జరగకుండా పరిరక్షించడమే ఈ జ్యేష్టాభిషేకం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ మూడు రోజుల పాటు స్వామివారికి విశేష కవచ సమర్పణలు జరుగుతాయి:
మొదటి రోజు (జూన్ 26) : శ్రీ మలయప్పస్వామివారికి సంవత్సరం పొడవునా ఉన్న పాత బంగారు కవచాన్ని పూర్తిగా తీసివేస్తారు. అనంతరం ప్రత్యేక హోమాలు, పంచామృతాలతో 'స్నపన తిరుమంజనం' (పవిత్ర స్నానం) నిర్వహిస్తారు. ఆ తర్వాత స్వామివారికి అత్యంత దేదీవ్యమానమైన వజ్రకవచాన్ని అలంకరించి పూజలు చేస్తారు.
రెండవ రోజు (జూన్ 27) : రెండో రోజు కూడా ప్రత్యేక తిరుమంజనాది కార్యక్రమాలు ముగిసిన తర్వాత స్వామివారికి నయనానందకరంగా ముత్యాల కవచాన్ని సమర్పిస్తారు.
మూడవ రోజు (జూన్ 28) : చివరి రోజున సాంప్రదాయబద్ధంగా తిరుమంజన ప్రక్రియలన్నీ పూర్తి చేసి, స్వామివారికి తిరిగి సరికొత్త బంగారు కవచాన్ని పునః సమర్పిస్తారు.
మూడవ రోజున స్వామివారికి అలంకరించే ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్టాభిషేకం ఉత్సవం వరకు అస్సలు తీయరు. సంవత్సరం పొడవునా శ్రీవారు ఇదే బంగారు కవచాన్ని ధరించి నిత్యం జరిగే వివిధ బ్రహ్మోత్సవాలు, ఊరేగింపులు మరియు విభిన్న ఉత్సవాల్లో భక్తులకు దర్శనమిస్తారు.
జూన్ 28న ఆర్జిత సేవలు రద్దు :
తిరుమల శ్రీవారి ఆలయంలో జ్యేష్టాభిషేక వేడుకలు అత్యంత వైభవంగా జరగనున్న నేపథ్యంలో.. ఉత్సవాల చివరి రోజైన జూన్ 28వ తేదీన ఆలయంలో నిర్వహించే పలు ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ వెల్లడించింది. రద్దయిన సేవల్లో కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, మరియు ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలు ఉన్నాయి. ఈ సేవల టికెట్లను బుక్ చేసుకున్న భక్తులు ఈ మార్పును గమనించి సహకరించాలని×. నిబంధనల ప్రకారం వారికి దర్శన సదుపాయం కల్పించబడుతుందని అధికారులు తెలిపారు.

## శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న కేంద్రమంత్రి




శ్రీశైలం మల్లన్నను సోమవారం నాడు ఉదయం కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి సతీ సమేతంగా శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న వారికి కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు, అర్చక స్వాములు, ఆలయ అధికారులు సాదరముగా స్వాగతం పలికారు. అనంతరం వీరు శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. దర్శనాంతరము అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో వేద పండితులు వేదాశీర్వచనము వల్లించగా, అర్చక స్వాములు తీర్థ ప్రసాదాలను అందజేశారు. తదుపరి ఆల ఈవో శేషవస్త్రల తో సత్కరించి లడ్డు ప్రసాదాలను అందజేశారు. తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటము బహుకరించారు.
శ్రీశైలం పుణ్యక్షేత్రానికి చేరుకున్న కిషన్ రెడ్డికి కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ముందుగా స్వామివారిని, ఆపై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు పూర్తి చేశారు. గర్భాలయం ముందు క్షేత్ర పాలకుడికి మొక్కులు చెల్లించుకుని భక్తిభావంతో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.






## రిటైర్డ్ టీచర్ ఫ్యామిలీ ఆత్మహత్య



సంగం మండలం దువ్వూరు గ్రామంలో విషాదం. గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.మృతదేహాలను స్వాధీనం చేసుకుని..విచారణ చేపట్టిన పోలీసులు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం. ఆత్మహత్యలకు గల కారణాలపై విచారణ కొనసాగింపు నెల్లూరు జిల్లా సంగం ఆత్మహత్య ఘటన స్థానికంగా కలకలం రేపింది. సంగం మండలం దువ్వూరు గ్రామంలో రిటైర్డ్ టీచర్ మధు కుటుంబం ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంట్లోనే ఉరి వేసుకుని వారు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది. ఈ ఘటన సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు.

## అర్ధరాత్రి నడిరోడ్డుపై ఎమ్మెల్యే వీరంగం



దెందులూరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అర్ధరాత్రి వేళ ఏలూరు నగరంలో తీవ్ర అలజడి సృష్టించారు. ప్రముఖ న్యాయవాది ఈడ్పుగంటి శ్రీనివాసబాబు నివాసమే లక్ష్యంగా ఆయన తన అనుచరులతో కలిసి దాడికి యత్నించడం స్థానికంగా పెద్ద కలకలం రేపింది. కేవలం మాటల గొడవతో ఆగకుండా, ఏకంగా పొక్లెయిన్లను రప్పించి సదరు న్యాయవాది ఇంటిని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించడం తీవ్ర సంచలనంగా మారింది. ఈ క్రమంలో "వాడో.. నేనో తేలిపోవాలి, చంపేస్తా!" అంటూ చింతమనేని బహిరంగంగానే తీవ్రస్థాయిలో ప్రాణాపాయ బెదిరింపులకు దిగారు. ఎమ్మెల్యే ఆగ్రహాన్ని గమనించిన శ్రీనివాసబాబు కుటుంబ సభ్యులతో పాటు సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న పోలీసులు ఆయనను వారించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ, చింతమనేని ఎవరి మాట వినకుండా తీవ్ర అహంకారంతో, ఆగ్రహంతో ఊగిపోవడంతో అర్ధరాత్రి వేళ ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది.
ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న శాసనసభ్యుడే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, అర్ధరాత్రి వేళ నడిరోడ్డుపై ఇలా వీరంగం చేయడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. గతంలోనూ పలు వివాదాల్లో చిక్కుకున్న చింతమనేని ప్రభాకర్, ఇప్పుడు ఏకంగా ఒక న్యాయవాది నివాసంపై పొక్లెయిన్లతో దాడికి యత్నించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రజాప్రతినిధే ఈ రకంగా దౌర్జన్యానికి దిగడంపై స్థానిక ప్రజలు, న్యాయవాద సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసినా సరే ఎమ్మెల్యే అస్సలు తగ్గకపోవడం, బెదిరింపులు కొనసాగించడం చూస్తుంటే ఆయన తీరు ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు, వివరాలు బయటకు రావడంతో ఏపీ రాజకీయాల్లో ఇది పెద్ద చర్చనీయాంశంగా మారింది మరియు చింతమనేనిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.



## దొంగల హల్‌చల్

బాపట్ల, జూన్ 15: బాపట్ల జిల్లాలో రన్నింగ్ రైల్లో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. అప్రమత్తమైన రైల్వే పోలీసులు దొంగలపై కాల్పులు జరిపారు. చెంగల్పట్టు నుంచి కాకినాడ వైపు వెళ్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు లక్ష్యంగా దొంగలు ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. రైలు బాపట్ల - అప్పికట్ల స్టేషన్ల మధ్య ప్రయాణిస్తున్న సమయంలో..
నిద్రిస్తున్న ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలను దొంగిలించడానికి దుండగులు ప్రయత్నించారు. అయితే, ప్రయాణికులు అప్రమత్తమై దొంగలను ప్రతిఘటించి గట్టిగా కేకలు వేశారు.
ప్రయాణికుల నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురవడంతో కంగుతిన్న దొంగలు, వెంటనే రైలు చైన్ లాగారు. రైలు ఆగగానే కిందకు దూకేశారు. రైల్వే పోలీసులు తక్షణమే స్పందించి, పారిపోతున్న దుండగులపైకి కాల్పులు జరిపారు. చీకటి కావడంతో దొంగలు సులువుగా తప్పించుకుని పారిపోయారు. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ప్రస్తుతం రైల్వే పోలీసులు ఈ దోపిడీ ముఠా కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.





# కరీనా కపూర్ బ్యూటీ సీక్రెట్స్..

నేటి ఆధునిక కాలంలో ప్రతి అమ్మాయి కూడా మరింత అందంగా, ఆకర్షణీయంగా కనిపించడానికి ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలో ముఖానికి నేరుగా బ్యూటీ ప్రొడక్ట్స్ వాడటం వల్ల మేకప్ సరిగా సెట్ అవ్వకపోగా చర్మం కూడా పాడయ్యే అవకాశం ఉంది. అందుకే పర్ఫెక్ట్ మేకప్ లుక్ రావాలన్నా, ఆ మేకప్ ఎక్కువ సయమం నిలవాలన్నా ముందుగా మన స్కిన్‌ని ప్రిపేర్ చేసుకోవడం చాలా ముఖ్యం. దీని కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టి బ్యూటీ పార్లర్లకు వెళ్లాల్సిన అవసరం లేదు. మన బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్ ఫాలో అయ్యే కొన్ని సింపుల్ హోమ్ మేడ్ చిట్కాలు పాటిస్తే చాలు..

1. DIY పేపర్ నాప్కిన్ పేపర్ మాస్క్ టిప్

అయితే కరీనా కపూర్ ఒకసారి ఈ బ్యూటీ చిట్కాను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. ఆమె తన వానిటీ వ్యాన్‌లో ముఖంపై తడి పేపర్ మాస్క్ వేసుకుని కూర్చుని ఉన్న ఫోటోను అభిమానులతో పంచుకున్నారు. అయితే మీరు కూడా ఈ లుక్‌ను చాలా సులభంగా పొందవచ్చు. ఒక పేపర్ నాప్కిన్‌ను చల్లటి నీటితో తడిపి దానిని ముఖంపై మెల్లగా ఉంచుకుంటే సరిపోతుంది. ఇది చర్మానికి హైడ్రేషన్‌ను అందించి ముఖాన్ని ఎంతో ఫ్రెష్‌గా మార్చడమే కాకుండా.. మన చర్మాన్ని మేకప్‌కు సిద్ధం చేస్తుంది. ఎలాంటి హడావుడి లేకుండా ఎప్పుడైనా ఎక్కడైనా చాలా సులభంగా చేసుకోగలిగే బెస్ట్ స్కిన్ కేర్ చిట్కాల్లో ఇది కూడా ఒకటి.

2. ముఖంపై ఐస్ రుద్దడం

మన స్కిన్‌ని మేకప్‌కు సిద్ధం చేసుకోవడానికి మరో సులభమైన పద్ధతి ఏమిటంటే.. ఐస్ రోలర్ సాయంతో ముఖానికి ఐసింగ్ చేయడం. దీన్ని సులభంగా చేయాలంటే మన ఇంట్లో ఉండే ఫ్రిజ్ నుంచి ఒక ఐస్ క్యూబ్‌ని తీసుకుని మృదువుగా ముఖంపై రుద్దుకోవచ్చు. ఇది చర్మ రంధ్రాలను తెరవడమే కాకుండా ముఖంపై ఉండే వాపును కూడా తగ్గిస్తుంది. చర్మంపై మంట పుట్టడాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా మనం ఉపయోగించే బ్యూటీ ప్రొడక్ట్స్ సులభంగా చర్మానికి పట్టేలా చేయడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది.

3. ముఖానికి మసాజ్ చేయడం

ఫేస్ మసాజ్ చేయడం అనేది చాలా సాధారణమైన విషయంగా అనిపించవచ్చు. కానీ దీని వల్ల వాస్తవానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. మన వేళ్లతోనే ఈ మసాజ్ చేసుకోవచ్చు. మేకప్ వేసుకునే ముందు ముఖాన్ని మెల్లగా స్మూత్‌గా మసాజ్ చేయడం వల్ల ముఖ కండరాలు రిలాక్స్ అవుతాయి. చర్మంపై ఎరుపుదనం తగ్గుతుంది,

# బెల్టెడ్ కేప్ ఫ్యాషన్ టాప్!

సాధారణంగా వదులుగా, గాల్లో తేలిపోయేలా ఉండే 'కేప్ ష్రగ్'ల గురించి మనకు తెలిసిందే. అయితే ఈ సీజన్‌లో వీటికి కాస్త స్టయిలిష్ హంగులు అద్దారు డిజైనర్లు. అదే.. 'బెల్టెడ్ కేప్' ట్రెండ్! వదులుగా ఉండే కేప్‌ను నడుము భాగంలో ఒక బెల్ట్‌తో ఫిట్ చేయడం ద్వారా లూజ్ ఫిట్టింగ్ కాస్తా పర్‌ఫెక్ట్ బాడీ షేప్‌గా మారిపోతుంది. ఇటు వెస్టన్ లుక్, అటు ట్రెడిషనల్ గ్రేస్ రెండూ ఒకేసారి అందించడం ఈ స్టయిల్ ప్రత్యేకత. ఒకే రంగున్న ప్యాంట్, క్రాప్ టాప్‌పైకి లాంగ్ ష్రగ్ వేసి, నడుముకి వెడల్పాటి లెదర్ బెల్ట్ పెడితే అదిరిపోయే ఇండో-వెస్టన్ లుక్ మీ సొంతమవుతుంది. ఆఫీస్ పార్టీలకు ఇది పర్‌ఫెక్ట్. సంప్రదాయ ఇక్కత్, ఖాదీ లవర్స్‌కు కూడా ఈ ఫ్యాషన్ బాగా సూట్ అవుతుంది.





కాటన్ లేదా ఇక్కత్ ప్రింట్లు ఉన్న కేప్స్ వేసుకున్నప్పుడు, దానికి మ్యాచింగ్ బ్రౌన్ లేదా బ్లాక్ కలర్ క్లాసిక్ బెల్టులు జత చేస్తున్నారు. ఇది క్యాజువల్ లుక్‌ని కూడా ఫ్యాషనబుల్‌గా మారుస్తుంది. పెళ్లిళ్లు, పండుగలకు సిల్క్ డ్రెస్సులు వేసుకున్నప్పుడు.. లెదర్ బెల్టుకి బదులు బంగారు లేదా వెండి రంగుల్లో వచ్చే 'మెటాలిక్ చైన్ బెల్టులు' (వడ్డాణం లాంటివి) వాడుతున్నారు. ఎత్తు కాస్త తక్కువగా ఉంటే, సన్నటి బెల్టులను ఎంచుకోండి. పొడవుగా ఉండేవారు వెడల్పాటి లెదర్ వాటితో మరింత రాయల్‌గా కనిపించవచ్చు. ఈ ట్రెండ్ వల్ల లాభం ఏంటంటే.. ఇది మనల్ని స్లిమ్‌గా చూపించడమే కాకుండా, రోజంతా సౌకర్యవంతంగా ఉంచుతుంది. దుపట్టా సర్దుకునే ఇబ్బంది లేకుండా, ట్రెండీగా మెరిసిపోవాలనుకునే అతివలకు ఈ బెల్టెడ్ కేప్' ఒక వండర్‌ఫుల్ చాయిస్. మీరూ ఒకసారి ట్రై చేసి చూడండి!




మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలు అమలు చేస్తోంది. మహిళా సంఘాలకు విద్యార్థుల ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యతలను అప్పగించింది. ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రోత్సహిస్తోంది. మహిళా క్యాంటీన్లు, కోళ్ల పెంపకం, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తోంది. వీటితో పాటు మహిళలు ఎంచుకున్న రంగాల్లో ఆర్థికంగా తోడ్పాటు అందించేలా ప్రభుత్వ మరో నిర్ణయం తీసుకుంది. వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తుండగా వాటి పరిమితిని పెంచింది. ఇది అమల్లోకి వస్తే మహిళా సంఘాల సభ్యులకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

కుటుంబ సభ్యులకు అండగా..

జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరుతున్నారు. కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ఆర్థిక అవసరాల కోసం సంఘం ఉందన్న భరోసా కల్గిస్తోంది. సంఘంలో చేరిన సభ్యులకు బ్యాంకు లింకేజీతో క్ష్మనిధి పథకం ద్వారా రుణాలు అందిస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీతో తీసుకునే రుణంలో రూ. 5 లక్షల వరకే వడ్డీలేనిదిగా గుర్తిస్తారు. స భ్యులు చెల్లిస్తున్న వడ్డీ డబ్బును ప్రభుత్వం తిరిగి సంఘం ఖాతాలో జమ చేస్తోంది. ప్రస్తుతం ఆ పరిమితిని పెంచడం ద్వారా మహిళా సంఘాలకు మరింతగా ప్రయో జనం చేకూరనుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 15 గ్రామ సమాఖ్య సంఘాలున్నాయి. 386 సంఘాల పరిధిలో స్వయం సహాయక పొదుపు సంఘాలు 8,158 ఉన్నాయి. వీటిలో 93,477 మంది సభ్యులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తోంది. ఇప్పటి వరకు రూ. 5 లక్షల వరకు మాత్రమే వడ్డీ లేకుండా రుణాలు ఇచ్చేవారు. ప్రస్తుతం దాని పరిమితిని రూ. 10 లక్షల వరకు పెంచుతున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంతి సీతక్క వెల్లడించారు. ఇటీవల ఈ నెల 1న కుమరం భీం జిలాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ప్రకటించారు. ఇది అమల్లోకి వస్తే సంఘాల సభ్యులు వ్యాపారాలను విస్తరించుకునే అవకాశాలు మెరుగ వనున్నాయి.

మెట్రో




# ఆవు నెయ్యితో ఆశ్చర్యకరమైన ప్రయోజనాలు!

భారతీయ గృహాల్లో, ముఖ్యంగా వంటింట్లో ఆవు నెయ్యికి విశిష్ట స్థానం ఉంది. కేవలం వంటకాలకే పరిమితం కాకుండా, తరతరాలుగా దీనిని సంప్రదాయ వైద్యంలోనూ విరివిగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఆవు నెయ్యిలోని ఆరోగ్య ప్రయోజనాలపై సర్వత్రా ఆసక్తి పెరుగుతోంది. ఆయుర్వేద నిపుణులతో పాటు ఆధునిక శాస్త్రవేత్తలు సైతం నెయ్యి వినియోగం వల్ల కలిగే మేలును విశ్లేషిస్తున్నారు. ఈ మేరకు టైమ్స్ ఆఫ్ ఇండియాc ఓ కథనం వెలువరించింది. మితంగా ఆవు నెయ్యిని తీసుకోవడం వల్ల బరువును నియంత్రించవచ్చని, శరీరంలో వాపులు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, హృదయ ఆరోగ్యానికి కూడా దోహదపడుతుంది. ఇందులో పుష్కలంగా ఉండే కాంజుగేటెడ్ లినోలెయిక్ యాసిడ్, బ్యూట్రిక్ యాసిడ్, విటమిన్-ఏ వంటి పోషకాలే ఈ విశిష్ట గుణాలకు కారణమని విశ్లేషిస్తున్నారు. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, నెయ్యి జీర్ణ వ్యవస్థను ఉత్తేజపరిచి, ఆహారంలోని పోషకాలను శరీరం సులభంగా గ్రహించేలా చేస్తుంది. అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలతో సతమతమయ్యే వారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. అయితే, కేవలం రుచి కోసం తగిన మోతాదులో మాత్రమే వాడాలని, అతిగా వాడటం శ్రేయస్కరం కాదని వారు స్పష్టం చేస్తున్నారు. నెయ్యిలో ఉండే cబ్యూట్రేట్c అనే ఫ్యాటీ యాసిడ్ పేగుల ఆరోగ్యానికి తోడ్పడటంతో పాటు ఇన్ఫెక్షన్లను నివారిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడించాయి.



# కరివేపాకు వల్ల కలిగే ఆరోగ్య లాభాలు



మనదేశంలో ఏ వంటకానికైనా సంప్రదాయ రుచి, సువాసన రావాలంటే పోపులో కరివేపాకు పడాల్సిందే. అయితే, భోజనం చేసేటప్పుడు చాలామంది కరివేపాకును కేవలం ఒక వాసన ఇచ్చే ఆకులా భావించి ప్లేట్ పక్కన పెట్టేస్తుంటారు. కానీ, ఆ చిన్న ఆకుల్లోనే ఊహించని ఎన్నో ఔషధ గుణాలు, ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం సుగంధ భరిత ఆకు మాత్రమే కాదు.. మన పెరట్లోనే దొరికే ఒక శక్తివంతమైన ప్రకృతి ప్రసాదించిన ఔషధం. కరివేపాకును పోషకాల నిలయంగా చెప్పుకోవచ్చు. ఇందులో విటమిన్ ఏ, విటమిన్ సీ లతో పాటు ఫ్లేవనాయిడ్లు, కార్బజోల్ ఆల్కలాయిడ్ల వంటి పవర్‌ఫుల్ యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. ఇవి శరీరంలో చేరి కణాలను నిర్వీర్యం చేసే ఫ్రీ రాడికల్స్‌తో సమర్థవంతంగా పోరాడుతాయి. ఈ ఫ్రీ రాడికల్స్ ప్రభావం వల్లే మనుషుల్లో త్వరగా ముసలితనం రావడం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తడం జరుగుతుంది. రోజూ ఆహారంలో కరివేపాకును భాగం చేసుకోవడం వల్ల ఈ ఆక్సిడేటివ్ (స్ట్రెస్ తగ్గి శరీరం అంతర్గతంగా దృఢంగా తయారవుతుంది.

జీర్ణక్రియ మెరుగుదలకు.. షుగర్ నియంత్రణకు చక్కని పరిష్కారం

కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి జీర్ణ సంబంధిత ఇబ్బందులతో బాధపడేవారికి కరివేపాకు ఒక అద్భుతమైన సహజ నివారణి. దీనిలో ఉండే పీచు పదార్థం (ఫైబర్) మలబద్ధకాన్ని నివారించి జీర్ణవ్యవస్థను సజావుగా సాగేలా చేస్తుంది. దీనితో పాటు, రక్తంలో గ్లూకోజ్ శాతాన్ని అదుపులో ఉంచడంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది. మధుమేహం (డయాబెటిస్) ఉన్న రోగులు ప్రతిరోజూ తమ ఆహారంలో కరివేపాకును చేర్చుకోవడం ద్వారా షుగర్ లెవల్స్‌ను సులభంగా నియంత్రణలో ఉంచుకోవచ్చని పలు రకాల పరిశోధనల్లో వెల్లడైంది.

# ఆకలి తగ్గించి బరువు కరిగించే ఆరోగ్యకరమైన కార్బోహైడ్రేట్లు



బరువు తగ్గాలంటే చాలామంది ముందుగా కార్బోహైడ్రేట్లను పూర్తిగా తగ్గించేందుకు ప్రయత్నిస్తారు. అయితే అన్ని కార్బ్స్ ఒకేలా ఉండవు. కొన్ని ఆరోగ్యకరమైనవి కూడా ఉంటాయి. అవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగించి బరువు తగ్గడంలో సాయపడతాయి. ఫైబర్, ప్రొటీన్, విటమిన్లు పుష్కలంగా ఉండే ఈ ఆహారాలు వెయిట్ లాస్ ప్రయాణాన్ని సులభతరం చేస్తాయి.

ఓట్స్

ఓట్స్‌లో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఆకలి త్వరగా వేయదు. దీంతో తరచూ స్నాక్స్ తినాలనే కోరిక తగ్గుతుంది. అందుకే ఉదయం అల్పాహారంగా ఓట్స్ తినడం మంచిది.

చిలగడదుంపలు

చిలగడదుంపలు నెమ్మదిగా జీర్ణమవుతాయి. శరీరానికి స్థిరమైన శక్తిని అందిస్తూ ఆకలిని నియంత్రిస్తాయి. వీటిలో విటమిన్ ఏ, ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటాయి.

బ్రౌన్ రైస్

తెల్ల బియ్యంతో పోలిస్తే బ్రౌన్ రైస్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది కడుపు నిండిన భావనను ఎక్కువసేపు కలిగించి అదనపు క్యాలరీలు తీసుకోకుండా చేస్తుంది.

క్వినోవా

క్వినోవా పూర్తి ప్రొటీన్ కలిగిన అరుదైన ధాన్యాల్లో ఒకటి. ఇందులో ఫైబర్, ప్రొటీన్ రెండూ అధికంగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఆహారం.

బీన్స్, పప్పుధాన్యాలు

రాజ్మా, శనగలు, మినుములు, కందిపప్పు వంటి బీన్స్, పప్పు ధాన్యాల్లో ప్రొటీన్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేసి బరువు నియంత్రణలో సాయపడతాయి.

హోల్ వీట్ బ్రెడ్

మైదాతో తయారైన బ్రెడ్ కంటే హోల్ వీట్ బ్రెడ్ మంచి ఎంపిక. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండటంతో రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా సాయపడుతుంది.

పండ్లు

యాపిల్, జామ, కమలాలు, బెర్రీల వంటి పండ్లలో సహజ చక్కెరలతో పాటు ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి తక్కువ కేలరీలతో ఎక్కువ పోషకాలు అందిస్తాయి.

బరువు తగ్గడంలో ఎందుకు సాయపడతాయి?

ఈ ఆహారాల్లో ఫైబర్, ప్రొటీన్ ఎక్కువగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉంటుంది. దీంతో అనవసరంగా తినే అలవాటు తగ్గి మొత్తం క్యాలరీల వినియోగం నియంత్రణలో ఉంటుంది. అంతేకాదు శరీరానికి అవసరమైన శక్తిని కూడా అందిస్తాయి

# మెట్రో ఈవినింగ్స్ సినిమా

## ఓటీటీలో స్ట్రీమింగ్ కానున్న దృశ్యం 3




## రూ.400 కోట్ల మార్క్ దిశగా 'పెద్ది'





## 188 మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన విజయ్-రష్మి





నాగర్‌కర్నూల్/బల్మూరు, జూన్ 14: తమకు పుట్టిన సొంత ఊరుపై ఉన్న మమకారాన్ని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులపై ఉన్న ప్రేమను చాటుకుంటూ టాలీవుడ్ స్టార్ సెలబ్రిటీ దంపతులు విజయ్ దేవరకొండ – రష్మిక మందన ఉదారత చాటుకున్నారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు 'దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో భారీ నగదు ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మన్‌పేట గ్రామ సమీపంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఈ స్కాలర్‌షిప్‌ల పంపిణీ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. స్థానిక అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణతో కలిసి నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన దంపతులు ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు చెక్కులను అందజేశారు.

## వైజాగ్ లో 'వారణాసి' షూటింగ్




గ్లోబల్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి, టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' సరికొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సిద్ధమైంది. ఈ సినిమా తదుపరి కీలక షెడ్యూల్‌ను అందాల సాగరతీరం విశాఖపట్నంలో జరపడానికి చిత్ర యూనిట్ ప్లాన్ చేసింది. అందుతున్న సమాచారం ప్రకారం, ఇప్పటికే దర్శకుడు రాజమౌళి తన ప్రధాన సాంకేతిక బృందం (టెక్నికల్ టీమ్) తో కలిసి వైజాగ్ చేరుకున్నారు. అక్కడ షూటింగ్ నిర్వహించబోయే లొకేషన్లను జక్కన్న స్వయంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వైజాగ్ సముద్ర తీర ప్రాంతాల్లో చిత్ర కథనానికి ఎంతో ప్రాధాన్యత ఉన్న కొన్ని భారీ యాక్షన్ లేదా కీలక సన్నివేశాలను సూపర్ స్టార్ మహేష్ బాబుపై చిత్రీకరించేందుకు దర్శకుడు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ వార్త తెలియడంతో వైజాగ్ బే ఏరియాలో ఇప్పుడే సినిమా సందడి మొదలైంది.

## శర్వానంద్ 'భోగి' సినిమా







యంగ్ హీరో శర్వానంద్, మాస్ డైరెక్టర్ సంపత్ నంది కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'భోగి' షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ఈ సినిమాకు అత్యంత కీలకమైన క్లైమాక్స్ ఎపిసోడ్ చిత్రీకరణను చిత్ర యూనిట్ తాజాగా హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఇందుకోసం ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె పర్యవేక్షణలో ఒక భారీ సెట్‌ను రూపొందించారు. దాదాపు 20 రోజుల పాటు ఈ లొకేషన్‌లోనే నాన్-స్టాప్‌గా క్లైమాక్స్ పోరాట ఘట్టాలను తెరకెక్కించనున్నారు.

## ఫిఫా వరల్డ్ కప్-2026లో భారత్ ముద్ర..



భారత్ ఇప్పటివరకు ఫిఫా వరల్డ్ కప్‌లో అర్హత సాధించలేకపోయింది. పురుషుల ఫుట్‌బాల్ జాతీయ జట్టు ప్రాతినిధ్యం ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్లో ఇప్పటి వరకూ లేదు. ఈ ఘటన భారీగా క్రీడాభిమానులు కలిగిన భారతదేశంకు పెద్ద లోటేనని చెప్పొచ్చు. 2022 ప్రపంచ కప్‌కు సంబంధించి ఫిఫా విడుదల చేసిన గణాంకాలు.. భారతదేశంలో టెలివిజన్, డిజిటల్, సోషల్ మీడియా వేదికల ద్వారా సుమారు 74.5కోట్ల మంది ఈ టోర్నమెంట్‌ను వీక్షించారు. దీంతో చైనా తరువాత భారతదేశం రెండో అతిపెద్ద మార్కెట్‌గా నిలిచింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక ప్రేక్షకులున్న దేశాల్లో భారతదేశం ఒకటిగా నిలిచింది.

మన దేశం ఎప్పుడు ఈ మెగా టోర్నీలో ఎప్పుడు ఆడుతుందా అని కోట్ల మంది భారతీయ క్రీడాభిమానులు దశాబ్దాలుగా కళ్లల్లో ఒత్తులు వేసుకుని మరీ ఎదురుచూస్తున్నారు. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫిఫా వరల్డ్ కప్ -2026 మెగా టోర్నీలో 48 దేశాలు పాల్గొంటున్నాయి. అందులో భారత్ లేకపోవటంతో కొంద బాధాకరమైనా.. భారతీయ మూలాలున్న నలుగురు ఆటగాళ్లు ఈ మెగా టోర్నీలో పాల్గొంటున్నారు. దీంతో ఈ ఆటగాళ్లు భారత అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు.

న్యూజిలాండ్‌కు చెందిన సర్‌ప్రీత్ సింగ్ ఈ జాబితాలో ప్రముఖుడు. పంజాబ్ మూలాలు కలిగిన 27ఏళ్ల సర్ ప్రీత్ సింగ్ న్యూజిలాండ్ జాతీయ జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. గతంలో జర్మనీ దిగ్గజ క్లబ్ బాయెర్న్ మ్యూనిక్‌తో కూడా అనుబంధం కలిగి ఉన్నాడు. అతనికి 2018లో జరిగిన ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో న్యూజిలాండ్ తరపున ఆడే అవకాశం లభించింది. ఆ టోర్నమెంట్‌లోనే ఆ ఆటగాడు తన తొలి అంతర్జాతీయ గోల్‌ను సాధించాడు.

ఖతార్ తరఫున ఆడుతున్న తహ్సీన్ మహమ్మద్ జంషిద్ కేరళకు చెందిన కుటుంబంలో జన్మించాడు. 19ఏళ్ల యువ ఫుట్‌బాలర్ ఖతార్‌లో పెరిగాడు. అక్కడి ఫుట్‌బాల్ టోర్నీల్లో సత్తాచాటి జాతీయ జట్టులో స్థానం సంపాదించాడు. ప్రపంచకప్ వేదికపై భారత మూలాలున్న యువ ఆటగాడిగా ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాడు. కేరళలోని కన్నూర్ జిల్లా వలపట్టణం ప్రాంతానికి చెందిన తహ్సీన్.. జంషీద్ తచ్చంకండి, వాసి షైమా దంపతుల కుమారుడు. తహ్సీన్ కుటుంబం 1996లో ఖతర్‌కు వలస వెళ్లింది. తహ్సీన్ తండ్రి జంషీద్ గతంలో కాలికట్ యూనివర్సిటీ తరఫున ఫుట్‌బాల్ ఆడాడు. తండ్రి అడుగుజాడల్లోనే నడిచిన తహ్సీన్ ప్రస్తుతం జాతీయ జట్టులో కీలక ప్లేయర్ గా కొనసాగుతున్నాడు.

ఆస్ట్రేలియా జట్టులోని నిషాన్ వేలుపిళ్లై తమిళనాడు మూలాలు కలిగిన కుటుంబానికి చెందినవాడు. అతనికి 25ఏళ్లు. తన వేగం, దూకుడైన ఆటతీరుతో ఆస్ట్రేలియా ప్రపంచకప్ జట్టులో కీలక ఆటగాడిగా నిలిచాడు. నిషాన్ తల్లి గిలియన్ ఆంగ్లో-ఇండియన్ వంశానికి చెందిన మహిళ కాగా, తండ్రిది శ్రీలంక-మలేషియా నేపథ్యం. ప్రస్తుతం మెల్‌బోర్న్ విక్టరీ క్లబ్ తరఫున అద్భుతంగా రాణిస్తున్న ఈ వింగర్.. 2024లో చైల్డ్‌తో జరిగిన వరల్డ్ కప్ క్వాలిఫైయర్ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. తన డెబ్యూ మ్యాచ్‌లోనే సూపర్ గోల్ కొట్టి ఆస్ట్రేలియా జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఆఫ్రికన్ దేశమైన డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోకు ప్రాతినిధ్యం వహిస్తున్న శామ్యూల్ ముత్తుసామి కూడా భారత వంశపారంపర్య సంబంధాలు కలిగిన ఆటగాడే.

# మెట్రో స్పోర్ట్స్





ఐపీఎల్ 2026 సీజన్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో దుమ్మురేపిన టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ లిస్ట్-ఏ క్రికెట్‌లో మాత్రం ఆ జోరు కొనసాగించలేకపోతున్నాడు. భారత్-ఏ తరపున శ్రీలంక పర్యటనకు వెళ్లిన వైభవ్ సూర్యవంశీ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విఫలమయ్యాడు.

ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా దంబుల్లా వేదికగా శ్రీలంక-ఏతో జరుగుతున్న మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ 14 మ్యాచ్‌ల్లో 21 పరుగులే చేసి వెనుదిరిగాడు. 150 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేసిన వైభవ్ 3 ఫోర్లు, ఒక సిక్స్ కొట్టాడు. సహన్ అరాచ్చిగే బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఈ ముక్కోణపు సిరీస్‌లో వైభశ్ సూర్యవంశీ మూడు మ్యాచ్‌లు ఆడగా.. ఒక్క ఇన్నింగ్స్‌లోనూ చెప్పుకోదగ్గ రీతిలో బ్యాటింగ్ చేయలేదు. శ్రీలంక-ఏతో జరిగిన తొలి మ్యాచ్‌లో 14 పరుగులే చేసిన వైభవ్.. అఫ్గాన్-ఏతో జరిగిన రెండో మ్యాచ్‌లో 44 పరుగులు చేశాడు. దూకుడుగా ఆడే ప్రయత్నంలో వికెట్లు పారేసుకుంటున్నాడు.

ఐపీఎల్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ.. అంతర్జాతీయ వేదికపై ఇలా వరుసగా విఫలమవ్వడం అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది.

## మా విజయంలో వారిదే కీలక పాత్ర : హర్మన్ ప్రీత్ కౌర్



మహిళా టీ20 ప్రపంచ కప్ 2026లో భారత జట్టు బోణీ కొట్టింది. బర్మింగ్‌హామ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 64 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. దీప్తిశర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శనకు తోడు లేడీ కోహ్లీ.. స్మృతి మంధాన, కెప్టెన్ హర్మన్ ప్రీత్ మెరుపులతో పాక్‌పై భారత్ ఆధిపత్యం ప్రదర్శించింది. టీమిండియా విజయంలో స్మృతి, దీప్తి శర్మలదే కీలక పాత్ర అని మ్యాచ్ అనంతరం హర్మన్ ప్రీత్ కౌర్ వెల్లడించింది.

టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ మాట్లాడుతూ... ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం ఆనందంగా ఉంది. మ్యాచ్ విజయంలో ఆ ఇద్దరు(స్మృతి మంధాన, దీప్తి శర్మ) కీలకపాత్ర పోషించారు. జట్టుకు అవసరమైనప్పుడల్లా వారిద్దరూ ఎప్పుడూ ముందుంటారు. ఇవాళ్టి మ్యాచ్‌లో కూడా వాళ్లిద్దరూ ఆడిన తీరు చూసి సంతోషంగా అనిపించింది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. అయితే ఆరంభంలో వికెట్లు పడడంతో కాస్త ఇబ్బంది ఎదుర్కొన్నాం. అనవసరంగా మాపై ఒత్తిడి తెచ్చుకున్నాము. అయితే పిచ్‌పై అవగాహన వచ్చిన తర్వాత మంధాన, నేను స్వేచ్ఛగా ఆడాం అని హర్మన్ తెలిపింది.

17 బంతుల్లో 34 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడిన రిచా ఘోష్ గురించి అడగ్గా.. రిచా ఘోష్‌కు బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ ఇవ్వొచ్చు. కానీ ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేసేందుకు తాను సిద్ధమని చెప్పింది. రిచాను ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు పంపాలని అనుకున్నాము. అదే స్థానంలో వచ్చిన రిచా.. తన పాత్రకు న్యాయం చేసింది. ఇక ఫీల్డింగ్‌లో కొన్ని తప్పులున్నాయి. రాబోయే మ్యాచ్‌ల్లో వాటిని సరిచేసుకుంటాం. నెట్ రన్‌రేట్ అనేది కీలకం కాబట్టి మరింత వేగంగా ఆడేందుకు ప్రయత్నిస్తా అని హర్మన్ ప్రీత్ కౌర్ చెప్పుకొచ్చింది.

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007